# సంస్కృతి

డాక్టర్ ప్రసాదరాయ కులపతి

Blank Page

# సంస్కృతి

డా॥ ప్రసాదరాయ కులపతి

ప్రచురణ

రిజిష్టర్డ్ నం. 1/64

యువభారతి
సాహితీ సాంస్కృతిక సంస్థ
5 కింగ్స్‌వే, సికిందరాబాదు-3

SAMSKRITI

An introduction to Indian culture by

Dr. Prasadaraya Kulapathi

© YUVABHARATHI, Secunderabad-500 003

యువభారతి

ప్రచురణ : 97

ప్రథమ ముద్రణ : ప్రతులు 3,200, డిసెంబరు 9, 1983

ముఖచిత్రాలంకరణ

శీలావీర్రాజు

ముద్రణ

సుమన ప్రింటర్స్

ముషీరాబాదు, హైదరాబాదు

ముఖచిత్రముద్రణ

శ్రీబాలాజీ ఆర్ట్ ప్రింటర్స్

చిక్కడపల్లి, హైదరాబాదు-500 020

వెల : రూ. 3-00

ప్రతులకు

యువభారతి

సాహితీ సాంస్కృతిక సంస్థ

5 కింగ్స్‌వే, సికిందరాబాదు-3

లేదా

యువభారతి కార్యాలయం

ఆంధ్ర సారస్వత పరిషత్ భవనములు

తిలక్ రోడ్, హైదరాబాదు-500 001

# యువభారతి పరిచయం

ఉత్తమ అధ్యయనం వల్ల వ్యక్తిత్వానికి సమగ్రత చేకూరుతుంది. సమాజంలో సామరస్యం పెంపొందుతుంది. ఉత్తమ భావప్రసరణానికి పుస్తకాలు చక్కని సాధనాలు, అందరికీ అందుబాటులో ఉండే విధంగా మంచి పుస్తకాలను అందించే ప్రయత్నానికి యువభారతి పూనుకొని గడచిన ఇరువయ్యేళ్ళుగా పాత కొత్తల మేలుకలయికను ప్రాతిపదికగా పెట్టుకొని నూరు పుస్తకాలను ప్రచురించింది. ఉపన్యాసమంజరీ కార్యక్రమాలను, సదస్సులను నిర్వహించింది.

సహృదయుల సహకారంతో పుస్తకాల అమ్మకంవల్ల వస్తున్న ద్రవ్యంతో పుస్తకాలను ప్రచురిస్తున్నా తక్కువ వెలకు ఎక్కువ విలువున్న సాహిత్యాన్ని అందించడానికి యువభారతి ఉద్యమిస్తున్నది. ఉత్తమ సాహిత్య ప్రచారాన్ని ధ్యేయంగా పెట్టుకొని, ప్రచురణలను వెలువరిస్తున్నదే కాని మా సంస్థ వ్యాపార సంస్థ కాదు.

భారత దేశంలో ఎక్కడున్నా సరే యువభారతి నిర్వహిస్తున్న సాహిత్యోద్యమంలో పాలుపంచుకునేందుకు ప్రారంభింపబడిన సాహితీ మిత్ర పథకంలో 8,500 మంది సహృదయులు చేరి ప్రణాళికను విజయవంతం చేసినారు-యువభారతి భవిష్యన్నిర్మాణంలో సహకరించేందుకు ఆరంభింపబడిన సభ్యత్వ పథకాలలో భారతీ మిత్రులుగా 975 మంది, భారతీ భూషణులుగా 125 మంది చేరారు.

యువభారతి నిర్వహిస్తున్న సాహిత్యోద్యమంలో సహృదయులు పరిచయం చేసుకోవాలని ఆశిస్తున్నాము. మాకు లేఖ వ్రాసి మా సంస్థ కార్యకలాపాల వివరాలను తెల్సుకొని మాతో సహకరించి సాహిత్యాభ్యున్నతికి, దేశాభ్యున్నతికి మేము చేస్తున్న ఉడుతా భక్తి సేవను ప్రోత్సహిస్తారని ఆకాంక్షిస్తున్నాము.

సహృదయుల సహకారమే సాహితీ వికాసం.

హైదరాబాదు
9-12-1983,

ఇరివెంటి కృష్ణమూర్తి
అధ్యక్షుడు, యువభారతి

# మా మాట

మానవశాస్త్రం (Anthropology)లో, మనిషి ప్రయత్నంవల్ల అతని జీవితంలో కలిగే మార్పుల తీరు తెన్నులనుCulture అందుము Cultureఅనే పదాన్ని మనంసంస్కృతి అంటున్నాము. సమానార్థకమే అయినా మన సంప్రదాయంలో సంస్కృతికి విశేషమైన అర్థంవున్నది. తాత్త్వికదృష్టితో పరిశీలించవలసినఅంశమిది.

మనిషి మానవుడుగా రూపొందడం సంస్కృతి. పాశవిక దశనుంచి ఎదిగి, సహజాతంగా సంక్రమించిన పశులక్షణాలను నిగ్రహించుకుని, అదుపులో పెట్టుకుని, సాంఘికాభ్యుదయంకోసం వ్యక్తిత్వాన్ని మలచుకోవడం సంస్కృతి. ప్రపంచంలో బహుదేశాలు కన్ను తెరువకపూర్వమే, భారతదేశంలో పారమార్థిక జ్ఞానం రెక్కవిప్పింది. బిందువులో సింధువును సందర్శించగలిగిన దార్శనికత్వం ఇక్కడ వేళ్ళు తన్నుకున్నది. వేషభాషల్లో ఆచార్య వ్యవహారాల్లో ఎంతో వైవిధ్యం ఉన్నా రాజకీయంగా చిన్నచిన్న రాజ్యాలుగా విడివిడిగా ఉన్న భారతదేశాన్ని సంస్కృతి విలువలు ఒకటిగా ఉంచగలిగినవి. ఆచరణలో అప్పుడప్పుడు దేశకాల పరిస్థితుల ప్రాబల్యంవల్ల కొంత లుప్తత ఏర్పడినా ఏ విలువలపట్ల భారతీయులకు గౌరవ మర్యాదలున్నవో వాటిని కాపాడు కోవడంలో ఎన్నడూ వాళ్ళు తూష్ణీం భావాన్ని ప్రదర్శించలేదు.

భారతీయ సంస్కృతికి సంబంధించిన కొన్ని అంశాలనూ, ఆంధ్ర సంస్కృతికి చెందిన కొన్ని అంశాలను సోదాహరణంగా డా॥ ప్రసాదరాయకులపతి గారు మా అభ్యర్థనను మన్నించి ఈ చిన్న పుస్తకంలో చక్కని చిక్కని భాషలో వివరించినారు. బమ్మెర పోతన భాగవతాన్ని పరిశీలించి పరిశోధించి డాక్టరేటు పట్టా పొందిన విద్వాంసులు. సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు భాషలలో మొక్కవోని పాండిత్యం ఆయనిది. వాగ్మివతంసుడు, సంప్రదాయ సంపన్నుడు. గుంటూరులోని శ్రీనాథపీఠానికి ఊపిరి. అక్కడి హిందూ కళాశాలలో ఆంధ్రోపన్యాసకుడు. భారతీయ సంస్కృతిని త్రికరణశుద్ధిగా నమ్మిన సచ్ఛీలుడు.

మాకీపుస్తకాన్ని వ్రాసి ఇచ్చి ప్రకటించుకునే అవకాశం కల్పించి తమ ఔదార్యాన్ని, స్నేహశీలతను చవి చూడనిచ్చినారు. డా॥ ప్రసాదరాయకులపతి గారికి మా కృతజ్ఞతాపూర్వకమైన అభివందనములు.

9-12-1983

ఇరివెంటి కృష్ణమూర్తి
అధ్యక్షుడు
యువభారతి

# భారతీయ సంస్కృతి

ఒకజాతి అనేకకాలములలో పురోగమించిన సంవిధానమునందు సముద్గమించిన సౌమనస విశేషమే సంస్కృతి. ప్రతి దేశంలో ప్రతి జాతిలో ఏదోకాలమున మహాపురుషులు దయింతురు. వారు కొన్ని త్యాగములు చేసి కొన్నిఅపూర్వగుణములు ప్రకటించి ఆప్రజలకు, ఆదేశమునకు అరాధ్యులగుదురు. వారి తరువాత ప్రజలు ఆ మహానీయుల జీవితములను భావించి వారేయే విశిష్టగుణములను తమ జాతి సంస్కృతి చిహ్నములుగా ప్రకటించు కొందరు. పరమ కరుణామయుడైన బుద్ధుడు బోధించిన మతమును మించిన అహింసా ప్రధానమైన మతమింకొకటిలేదని బౌద్ధులు పలికిన, జనులకై తన్ను త్యాగము చేసికొనిన ఏసుక్రీస్తు బోధించిన తమ మతమే గొప్పదని క్రైస్తవులందరు. కరుణామయులు, త్యాగధనులు, ఎందరో ఉద్భవించుటయే కాక. తాత్వికముగా అద్వైత. ద్వైత, విశిష్టాద్వైత సిద్ధాంతములను మానవులకందిచిన తమ ధర్మము గొప్పదని హైందవులు భావింతురు. ఏదైనను ఆయా జాతులలో, ఆయా మతములలో, ఆయా దేశములలో పుట్టిన మహాభావుల ప్రవర్తన రీతియే సంస్కృతికి మూలము.

ఈనాడు భారత దేశములో సంస్కృతి యను పదము అత్యంత విశాలమైన అర్థంలో ప్రయోగింపబడుచున్నది. ఇది ఈనాడుపయోగింపబడు చున్నంత భావ వైశాల్యము ప్రాచీన కాలమున లేదు. నేడు సంస్కృతి యనగా సర్వజీవ. నిర్జీవ పదార్థములకు మానవులకు కళలకు చెందిన ఒకానొక సంప్రదాయ వైశిష్ట్యముగా కొందరు నిర్వచించు చున్నారు. సమ్యక్ కృతియే సంస్కృతి అవి ఒక ఉత్తమమైన ఆచరణము. సంస్కృతి సహజముగా జీవగతము, భావగతము ఈ జీవ, భావగతమైన ఒక ప్రేరణ ఒక క్లిష్ట సమయమున, ఒక పరీక్షవేళ విశిష్టప్రవర్తనకు కారాణభూతమై, ఆ ప్రవర్తనము విద్వాంసులచే ప్రశంసితమైనపుడు అది ధర్మమనిపించు కొనును. మానవ శ్రేయస్సును ధరించునది ధర్మమైనచో ఆ మానవుని ఉదాత్తాచరణమే సంస్కృతి.

నేటి కాలమున వేదసంస్కృతి ప్రాచీనసంస్కృతి, భారతీయసంస్కృతి ఇత్యాది పదములు తరచుగా వినవచ్చుచున్నవి. ఒక ప్రత్యేక దృష్టితో వానినే పూర్వ

కాలమున వేదధర్మము, ప్రాచీనధర్మము, భారతీయధర్మము అని పలికెడివారు. ప్రాచీనార్ధమున ధర్మము సంస్కృతి కంటె మహోన్నతమైనది ఆధునాతనార్ధమున సంస్కృతి ధర్మము కంటె సువిశాలమైనది. నవ్యులు కొందరు సంస్కృతి ధర్మములను కొన్ని సమయములందేకార్ధమున భావింతురు. అది తత్సమయౌచిత్యమును బట్టి సత్యసుందరముగానే భాసిల్లును.

ప్రపంచములో మానవులు నిరంతరము పుట్టుచు, గిట్టుచు నుందురు ఉదయించిన ప్రతివారికిని ఏదో ఒక సంస్కారముండును. అంతమాత్రమున ప్రతి వాడును సంస్కారవంతుడు కాడు. గుణవంతుడనుమాట ఉత్తమగుణములు కలవానియందే ఎట్లుచెల్లుచున్నదో, కీర్తిమంతుడను మాట ఏ విధముగా సత్కీర్తి కలవానియందు చెల్లుచున్నదో అటులే సంస్కారవంతుడనుమాట ఉత్తమ సంస్కారము కలవానియందే చెల్లును. ఒక జాతిలోని ఉత్తమ సంస్కారులైన మానవులెట్లు ప్రవర్తితుంరో వారినైతికమైన విస్ఫురణముల, విశిష్టతల సమాహారమే సంస్కృతి. ఇక్కడ నొక చిక్కుకలదు. ఉత్తముడెట్లు ప్రవర్తించును? అతని సంస్కారమునకు గుర్తేమి? ఒకడు చాలా ఉత్తముడను కొందము వాడు నల్గురివలె పెరిగి, పెద్దవాడై పెండ్లిచేసుకొని. పిల్లలనుగని, వార్ధకమున మరణించెననుకొనుడు. వాని సంస్కారము వలన లోకమునకు కలిగిన ప్రయోజనమేమియు లేదు వాడెట్టి వాడైనను, జీవితములో వాని గుణమునకు ప్రయోజనము లేనప్పుడది వ్యర్థమే.

కం॥ ఉడుముండదె నూరేండ్లును పడియుండదె పేర్మిపాము పదినూరేండ్లున్
మడుగున కొక్కెరయుండదె, కడునిల పురుషార్థపరుడు కావలెసుమతీ॥

అని పలికిన విధముగ పురుషార్థపరుడై, సంస్కార ప్రయోగమునకు జీవితములో అవకాశము లభించిన ఉత్తమగుణసంపన్నుని ప్రవర్తనమే ఆదర్శచిహ్నముగ నిలుచును, వారి వర్తనముల గణనీయ గాథాగుచ్ఛమే వారుద్భవించిన జాతియొక్క సంస్కృతి.

భారతీయ సంస్కృతి యనగా భారతీయులలోఉత్తములైన మానవులు అనేక ఘట్టములలో ఎటుల ప్రవర్తించిరో ఆ నడవడికలోని ఒక ధర్మవిశేషము. మరి యింతకును భారతీయులనగా నెవ్వరు? భారతదేశములో నివశించు ప్రతిమానవుడును భారతీయుడేనా? ఈనాడు ఈ దేశమును దూషించువా రనేకులిక్కడనే కలరు. ఇక్కడి ప్రజలు వేల లక్షల సంవత్సరములనుండి ఆరాధ్యులుగ. పూజ్యులుగ ఏ రాముని, కృష్ణుని, జగద్గు

వులని భావింతురో వారిని ద్వేషించువారు, దూషించువారు, హీనముగపలుకువారు ఈ దేశమున సమృద్ధిగా కలరు, అమెరికాకు పోయి, ఆ దేశపుగడ్డపై నిలబడి ఆ జాతికి గౌరవపాత్రులైన వాషింగ్టన్, అబ్రహాం లింకన్ మొదలైనవారిని గూర్చి నీచముగ మాటలాడినచో ఆ ప్రభుత్వము, ప్రజలు అట్టివారిని శిక్షించుట, వెళ్ళగొట్టుట తథ్యము. అటులే ఇంగ్లండులో ఏ బ్రిటిష్ రాణిని తిట్టినచో వారు బ్రదుకనీయరు. ఇక మహమ్మదీయ, కమ్యూనిస్టు దేశములలో నోరెత్తుటకు వీలులేదు. కాని ఈ భారతదేశమున, జాతికి వెలుగుతీర్చిన ఋషులను తిట్టవచ్చును. అవతారమూర్తులను తిరస్కరింపవచ్చును. వీరులను దూరవచ్చును. ఆచార్యులను నిందింపవచ్చును. ఇన్నిచేసియు ఇచ్చట స్వేచ్ఛగా విహరింపవచ్చును. ఇది ఈనాటి మనదేశపరిస్థితి. ఇట్టివారు పేరుకు భారతీయులే కాని నిజమునకు కాదు వారి ఆచరణము మన సంస్కృతికాదు.

శ్లో॥ ఉత్తరం యత్ సముద్రస్య హిమాద్రేశ్చైవదక్షిణం
వర్షం తద్భారతం నామ భారతీయత్ర సంతతిః

అని పూర్వోక్తి హిమాచలమునకు దక్షిణముగా, సముద్రమునకు ఉత్తరముగాగల దేశము భారతవర్షము. అందుండు ప్రజలు భారతీయులు. భారతీయులనగా భరతుడని భరతుడనగా నెవరు? వేదఋషి సంప్రదాయమునకు ప్రతీక. కనుక భరతీయులనగా ఋషిమార్గము ననుసరించువారు. ఆ ఋషులేమిచెప్పిరి? "ఏకం సద్విప్రా బహుధావదంతి" యన్నారు. ఇంద్రుడనినను, మిత్రుడనినను, యముడనినను, వరుణుడనినను, అగ్నియనినను-ఒకే సత్పదార్థముయొక్క నామభేదములనిరి. మా దేవుడెక్కువ, ఆ దేవుడు తక్కువ-మా దేవుని ఆశ్రయింపని వారందరు నరకమునకుబోదురు-అని పలుకువారు మత విద్యారంగమున ప్రాథమిక పాఠశాల విద్యార్థులు.

యతోవా ఇమాని భూతాని జాయంతే
యేనజాతాని జీవంతి
యత్ప్రయం త్యభి సంవిశంతి
తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి.

—తైత్తిరీయోపనిషత్తు.

ఎవనినుండి యీ భూతములన్నియు పుట్టుచున్నవో, ఎవనిచేత జీవించుచున్నవో ఎవనియందు ప్రవేశించుచున్నవో అతని బ్రహ్మముగా తెలిసికొనుము—

అను పాఠము గ్రహించినవారు భారతీయులు.

శ్లో॥ పునరపి జననం పునరపి మరణం. పునరపి జననీ జఠరే శయనం
ఇహ సంసారే ఖలుదుస్తారే కృపయాపారే పాహిమురారే
భజగోవిందం భజగోవిందం గోవిందంభజమూఢమతే
సంప్రాప్తే సన్నిహితేకాలే నహినహి రక్షతి డుకృఞ్కరణే.

—శంకరులు.

ఈ సంసారమున జననమరణములు తప్పవు. కర్మననుసరించి అవి సంప్రాప్తించు చుండును. ఎన్నివందలవేల జన్మలెత్తినను జనార్దనునికరుణలేక ఆ పరంపరనుండి ముక్తిరాదు. కనుక ఆ గోవిందు నాశ్రయింపుము-నీశాస్త్రపాండిత్యము మృత్యువు సన్నిహితమైనవేళ రక్షింపదు.

అనుసత్యము నెరిగి జీవితముయొక్క అశాశ్వతత్వమును, జన్మకర్మ సిద్ధాంతమును గుర్తించినవాడు భారతీయుడు. అటువంటి వారిలో ఉత్తముల ప్రవర్తన భారతీయ సంస్కృతి.

ప్రపంచములో ప్రతిదేశమునకు, ప్రతిజాతికి ఒకజీవనవిధానముండును, ఒక ఆచారపరంపర యుండును. వానినిబట్టి ఆ జాతిసంస్కృతిరూపొందును. సత్యము, అహింస, త్యాగము, అస్తేయము మొదలగు సద్గుణములను అన్నిజాతులవారును, అన్ని మతములవారును బోధింతురు. అంగీకరింతురు. మరి భారతీయ సంస్కృతి విశిష్టత యేమి? అన్నచో-ఒక సమాన జీవితఘట్టమునందు భారతీయుడు, అభారతీయుడు ప్రవర్తించిన పద్ధతినిబట్టి ఒక నిర్దిష్టమైన ఆలోచనాసరళిలో కొన్ని సిద్ధాంతములు చేయవచ్చును. కొన్ని సూత్రములు రూపొందించవచ్చును.

పాశ్చాత్య వాఙ్మయములో హెలెన్ ఆఫ్ ట్రాయ్ కథ సుప్రసిద్ధమైనది. అందు హెలెన్ అను ఒక జగదేకసుందరిని ఆమె భర్తలేనప్పుడొకడపహరించెను, ఆ తరువాత ఆ భర్త అనేకసైన్యములను కూర్చుకొని మిత్రులసహాయ్యముతో తనభార్యాపహర్తపై దండెత్తి వాని నోడించి తిరిగి తనభార్యను తెచ్చుకొనెను. ఇట్టిదే మనవాఙ్మయములో సీతాపహరణకథ. రావణుడను లంకాపతి తన భార్యనపహరింపగా శ్రీరాముడు వానర సహాయముతో సేతుబంధనము చేసి సముద్రముదాటి లంకపై దండెత్తి, రావణుని సంహా

రించి తన భార్యయగు సీతను తిరిగి తెచ్చుకొనెను. లోకోత్తర సౌందర్యవతియు, పరమ పవిత్రయు నైన సీత సుశీల అని తెలిసియు సభాముఖమున ఆమె అగ్నిప్రవేశముచేసి తన సౌశీల్యమును ప్రకటించుకొన్నదాకా రాముడామెను పరిగ్రహింపలేదు. ఇక పాశ్చాత్యుల చరిత్రలోనో హెలెన్ తననెత్తుకుపోయినవానితో చిరకాలము శారీరకసుఖము అనుభవించినది. ఆ విషయము తెలిసియు ఆమె భర్త కామమోహితుడైన ఆమెను తిరిగి పరిగ్రహించినాడు.

ఒక మహా కావ్యమునకు నాయిక యీరీతిగా ప్రవర్తించుట ఆ పాశ్చాత్య కావ్య స్రష్టలకు అంత అభ్యంతర కరముగ తోచలేదు. హెలెన్‌వంటి వారు కాని, ఆమెభర్త వంటివారు కాని, మనదేశమున ఉండరనికాదు. గుణాగుణములు కలవారన్నికాలములలో, అన్ని దేశములలోనుందురు. కాని మనము సద్గుణరహితులను, సౌశీల్యశూన్యులను ఆదర్శప్రాయులుగా గ్రహింపము. పై రెండు పోలికలుగల కథలను బట్టి పాశ్చాత్య సంస్కృతికిని, భారతీయ సంస్కృతికిని భేదమును సునిశితముగా భావింపవచ్చును.

సామాన్యుడు అయ్యోపాపం, హెలెన్ చిరకాలము భర్తకు దూరముగా ఉండవలసి వచ్చినదికదా. కామమును సంయమించుకొనుట మిక్కిలికష్టము, ఆహారనిద్రాభయమైథునములు సర్వప్రాణిసహజములు. ఎవరైననెంతకాలమోర్చుకొనగలరు. కావున హెలెన్ అట్లు ప్రవర్తించినచో అది సహజమే అని కొందరందరు. మానవులలో అసుర ప్రవృత్తి, దివ్యప్రవృత్తి రెండును కలవు. అసురప్రవృత్తియొక్క పాలు అధికముగ గలవారు కామక్రోధవశులై హెలెన్‌వలె ఆమె భర్తలవలె ప్రవర్తింతురు. దైవీప్రవృత్తిపాలు హెచ్చుయినవారు సీతవలె ప్రవర్తింతురు. జీవితకాలమంతయు ఒకకష్టము వచ్చినను ధర్మచ్యుతికి లొంగి అల్పత్వమునకు లోనుగారు.

రామకథా విషయమున మరియొక ఆక్షేపణము కొందరు చేయుచున్నారు. రాముని చరి తమును రెవ ఎడ్వర్డు చరిత్రముతో పోల్చి ఇట్లనుచున్నారు. తనను వరించి, ప్రేమించి, తోడునీడగా అడవులలో కూడ కష్టములుపడిన సీతకు ఆమె దోషమేమియులేకుండగానే రాముడు రాజ్యముకొరకై వెళ్ళగొట్టినాడు. తాను ప్రేమించిన సింప్సన్ సతికొరకు రవిఅస్తమించని బ్రిటిష్‌సామ్రాజ్యమునే తృణప్రాయముగ వదలివేసినాడు ఎడ్వర్డు దివ్యమైన ప్రేమకొరకై భౌతికమైన సామ్రాజ్యమును త్యాగముచేసిన ఎడ్వర్డు రాజ్యముకొఱకై ప్రేమమూర్తియైన భార్యను వెళ్ళగొట్టిన రామునికంటె ఎన్నోరెట్లు గొప్పవాడు.

ఈ వాదము వినుటకు సబబుగానే ఉన్నట్లు తోచును. కాని సూక్ష్మముగాపరిశీలించినచో ఇందు బలమేమాత్రమును లేదని సులభముగ నిరూపింప వచ్చును. మానవుడు సంఘజీవి ప్రతివానికిని తన చుట్టునున్న సమాజమునకు సంబంధించిన బాధ్యతలుండును. కొందరికి తమ కుటుంబమునకు సంబంధించిన బాధ్యతలుండును, మరి కొందరికి వేరు బాధ్యతలుండును. ఒక రాజ్యమునకు వారసుడైన వ్యక్తికి తన దేశగౌరవమును, వంశప్రతిష్ఠను నిలబెట్టి ప్రజలను సమర్థతతో పరిపాలింపవలసిన బాధ్యత ఉండును. వైయక్తిక సుఖమునకై ప్రజలు, దేశమును తన యందుంచిన బాధ్యతనువిస్మరించి స్వార్థమును చూచుకొనువాడు అల్పుడు. ప్రపంచవ్యాప్తమైన ఆంగ్లసామ్రాజ్యమును కాపాడవలసిన బాధ్యతగల రాజకుమారుడు కేవలకాముకుడై రాజమర్యాదలకు విరుద్ధముగ పిల్లలున్న వితంతువును పెండ్లి చేసికొన నెంచుట, దానికై రాజ్యమును వదులుకొనుట ఎడ్వర్డు రాకుమారుని భోగపరాయణత్వమును సూచించునే కాని దివ్యప్రేమను, త్యాగమును ప్రకటింపవు మరి రఘువంశీయుడైన శ్రీ రాముడు అటుల కాదు. ఆయనకు లోకారాధనము ప్రధానము. తన సుఖభోగములు ప్రధానముకాదు, అందుకే భవభూతి మహాకవి రాముని చేత

శ్లో॥ స్నేహం దయాంచ సౌఖ్యంచ యది వా జానకీమపి
ఆరాధనాయ లోకస్య ముంచతోనాస్తి మేవ్యథా ॥

అని పించినాడు. లోకారాధనము కొఱకై అవసరమైనచో స్నేహమును, దయాది సౌఖ్యములనే కాదు తుదకు జానకినైనను పరిత్యజించుటకు వ్యధచెందనని రామునిప్రతిజ్ఞ. లోకము కొఱకై బ్రతుకంతయు కర్పూర హారతివలె చేసిన రాముడెక్కడ, తన సుఖము తాను చూచుకున్న ఎడ్వర్డెక్కడ. హస్తిమశకాంతరము భేదమున్నది!

ఈ విధముగానే మరి కొందరు మహాత్మాగాంధి అహింసా సిద్ధాంతమును రామాయణమున కన్వయించి కువిమర్శలు చేయుచున్నారు. వారివాదన ఇది, మనము గాంధీవాదులము మహాత్ముడహింసా మార్గమున సత్యాగ్రహసమరము చేసి మనకు స్వాతంత్ర్యము సంపాదించి పెట్టెను. ఎట్టి పరిస్థితిలోను మనమహింసా మార్గమును వీడరాదు. హింస మన తత్వమునకు, మన సిద్ధాంతమునకు విరుద్ధము. రాముడు హింసా వాదిగా కనిపించును. ఎందుకనగా తన భార్యను రావణాసురుడెత్తుకొని పోయినాడని కోపముతో వానర సైన్యము సహాయముచేసికొని లంకపైదండెత్తి ఒక్కరావణునే కాక లక్షల

కొలది రాక్షస జాతులను నాశనము చేసెను. ఒక స్త్రీ కోసమై ఇంతమందిని చంపుట అహింసా సిద్ధాంతమునకు విరుద్ధము. ఇంతమందిని చంపుటకు బదులుగా మరొకరినెవరి నైనా పెండ్లిచేసుకొని సుఖముగ నుండవచ్చును కదా! క్రూరుడై ఇంతమారణకాండను జరుపనేల ?

అహింసాసిద్ధాంతమర్థముకాని దుర్విమర్శకుల నీరసవాదమిది. మహాత్ముని హృదయము నర్థము చేసికొనని అజ్ఞుల ప్రేలాపన గాంధీ మహాత్ముని జీవితములోని ఒక సంఘటన నిచ్చట ఉదాహరింతును నవ భారత దురంతములు జరిగిన పిదప గాంధీమహాత్ముడొక గ్రామమును చూచుటకు పోయెను అక్కడి జనులు నిరాశ్రయులై యున్నారు. వారి స్త్రీల నితరమతస్థులెత్తుకుని పోయిరి. ఇండ్లువాకిండ్లు దోచుకొనిరి. కట్టుగుడ్డలు కూడ సరిగాలేక దుస్థితి పాలైన ఆ దీనులను చూచి గాంధీగారు "ఏమయ్యా వారు వచ్చి అంత దౌర్జన్యము చేయుచుండగా మీరు ఇంతమంది ఉండియు ఏల ఊరకుంటిరి"? అని అడిగెను అందులకు వారు "మహాత్మా మేము మీ అనుచరులము. మీరు బోధించిన అహింసా సిద్ధాంతమును ఆచరించెడి వారము. దానికి కట్టుబడి శత్రువులు వచ్చిఏమి చేయుచున్నను సహించి ఊరుకుంటిమి. ఎదురించుట, వారితో కొట్లాడుట మీబోధలకు విరుద్ధముకాదా. అందుచేత మిక్కిలి సహనముతో ఓర్చుకొని నిలిచితిమి" అని సమాధానము చెప్పిరి దానికి మహాత్ముడెంతో బాధ పడెను. అయ్యోనేను జీవించి ఉండగానే నా అహింసాసిద్ధాంతమింత అపార్థము చేసికొనబడునని కలనైనా ఊహింపలేదు. మీరు వారితో పోరాడి మరణించినచో నేనెంత సంతోషించెడి వాడను". అని వారికామహాపురుషుడు చివాట్లు పెట్టినాడు. కాశ్మీరముపై పాకిస్తాన్ సేనలు దండయాత్రకు వచ్చినప్పుడు భారత ప్రభుత్వము కాశ్మీరులోనికి సైన్యములను పంపవలెనని చెప్పిన మొదట వ్యక్తి గాంధి రామతత్వము ఆయనకు ఒంటపట్టినంతగా ఇంకేవరికి పట్టలేదనిన అసత్యముకాదు. మరణసమయముకూడ రామరామాయనే ఉచ్చరించుచు ప్రాణములువదిలిన ఆ రామభక్తుని దృష్టికి రాముడు చేసిన రాక్షససంహారము దోషముగ ఎన్నడును కన్పింపలేదు. చెట్టు పేరుచెప్పుకొని కాయలమ్ముకొను వారివలె గాంధీగారి పేరుచెప్పుకొని బ్రదుకు వంచకుల కువ్యాఖ్యానములు మాత్రమే ఇవి.

జాతిగౌరవమునకు ప్రత్యేకత స్త్రీ ఆమెకపచారము జరిగినప్పుడు దానికికారకుడైన వాడెంతవాడైనను శిక్షార్హుడే. అహింస, దయ, ఇక్కడ పనికిరావు. ఒక స్త్రీ గౌరవమును కాపాడుటకు, మర్యాద నిలబెట్టుటకు అవసరమైనచో కొన్ని లక్షలమందిని సంహరించినను

తప్పులేదు. పది లంకలు తగులబెట్టినను పాపములేదు. రాజ్యమున సామాన్య స్త్రీకిని భద్రత ఉండవలయును. అట్టిచో రాజులతివలనెత్తుకుపోయినను దిక్కులేనట్లు ఊరుకున్నచో ఇక ప్రజలలో భద్రత భావమెట్లు నిలుచును? హింసాహింసల తత్వములు తెలియని ఆప వ్యాఖ్యాకారుల మాటలకు విలువనియ్యవలసిన పనిలేదు.

సంస్కృతిలో ప్రధానమైనది శీలము భారతీయులు దీనికి ప్రాణమిత్తురు మిగిలిన అన్నింటికంటే దీనికే అత్యంత ప్రాముఖ్యము. రామాయణములో ఒక కథ కలదు. శ్రీరామ చంద్రుని కుమారుడగు కుశునకొక కలవచ్చినది. ఆస్వప్న దర్శనమున ఒక అద్భుత సౌందర్యవతి అతని ముందున్నది. సానురాగముగజూచినది. సాదరముగా ఆహ్వానించినది. కుశుకుడు చూచినాడు. అతనికెట్టి వికారమును కలుగలేదు. చిత్రమేమనగా లోకమున జాగ్రదవస్థలో వివేకము మేల్కొని యున్నవేళ కామవాంఛను నిగ్రహించుకోవచ్చును. కాని స్వప్నవస్థలలో నిగ్రహించుకోగలవారు చాల తక్కువ. మనసావాచా కర్మణా శీలవంతు డగు వానికి మాత్రమే అది సాధ్యము. ఈనాటి ప్రపంచములో పిలువకయే ఆడవారి వెంటబడి నిష్కారణముగా వేధించు పురుషశబ్ద వాచ్యులగుహీనులకు కుశుని వంటి వారి సంస్కారమర్థములేదు. అతడన్నాడు –

శ్లో॥ కాత్వంశుభే కస్యపరిగ్రహోవా?
కింవా మదభ్యాగమ కారణం తే
ఆచక్ష్వమత్వా వశినాం రఘూణాం
మనఃపరస్త్రీ విముఖప్రవృత్తిః

అమ్మా! ఎవరో నీవు! ఎవరి భార్యవు! నాదగ్గరకు ఎందుకు వచ్చినావు రఘువంశ రాజులు పరస్త్రీవిముఖులని నీకుతెలియదా!

ఆమె తరువాత ఏదోసమాధానము చెప్పినది. అదే వేరువిషయము కలలోనైన పరకాంతయందు సౌఖ్యము ప్రదర్శింపని మనోవృత్తి కుశునిది. అతడుదయించిన రఘు వంశక్షత్రియుల సంస్కారమటువంటిది.

ఆధునికుల ఆలోచనా ధోరణివేరు వారి దృష్టిలో కుశునిది పెద్దగొప్పతనమేమియు కాదు. అతడటులేల ప్రవర్తింపవలెను! దానిని ఉత్తమ సంస్కారమని ఏలప్రశంసింప

వలెను? ఒక సుందరాంగి, ఒక విలాసిని, ఒక పురుషుని పిలిచిన హాయిగా సుఖపడక ఆ యవకాశమునేల జారవిడువవలెను? పరమ సౌందర్యరాశియగు అప్సరస వరూధినిని తిరస్కరించిన ప్రవరుసిగూడ ఇటులే అవహేళనచేయువారే లోకమున ఎక్కువమంది.

మనుచరిత్ర చదునప్పుడు - వరూధిని - కామోద్రేకముతో

శ్లో॥ ప్రాంచద్భూషణ బాహుమూల రుచితో పాలిండ్లు పొంగారి పై
యంచుల్ మోవగ కౌగలించి అధరంబాసింప హా శ్రీహరీ
యంచున్ బ్రాహ్మణు డోరమోమిడి తదీయాంస ద్వయంబంటి పో
మ్మంచుం ద్రోచె కలంచునే సతులమాయల్ ధీరచిత్తంబుల౯

అను పద్యము కడకు వచ్చినపుడు ప్రవరుని శీలమహత్వమును ప్రశంసించువారికంటె అయ్యో! ప్రవరుడెటువంటి మహత్తరమైన అవకాశమును పోగొట్టుకున్నాడు! నేనే ఆ స్థానమున నున్నచో అని గుటకలు మ్రింగువారే అధికులు. తుదకు గ్రంధకర్తయగు కవితా పితామహుడు పెద్దనకూడ

చ॥ తరుణి ననన్యకాంత నతిదారుణ పుష్పశిలీముఖవ్యధా
భర విదళాంగి నంగభవుబారికి నగ్గముచేసి క్రూరుడై
అరిగె మహీసురాధము డహంకృతితోనని రోషభీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణిదాల్చె కషాయదీధితి౯

సూర్యముఖమున ప్రవరునిచే మహీసురాధముడని అనిపించి- వరూధినిపై తనకుగల సాను భూతిని వ్యక్తము చేసినాడు.

ఇంతకు ఈ ప్రవరునిగాని, ఆకుశునిగాని. శీలమహితులని ఏల స్తుతింపవలెను? ఆ విధముగా నిగ్రహముతో ప్రవర్తించుట ఉత్తమధర్మమని పెద్దలు చెప్పుటవలన, ఆ పెద్ద లటులేల చెప్పిరి ? స్త్రీపురుషులు స్వైరవిహారులై, స్వేచ్ఛాకాములై ఏల ప్రవర్తింపరాదు? ప్రవర్తించినచో వచ్చునష్టమేమి ? నియమరహితమైన ఇష్టజీవనమును గడుపక నిరర్థక మగు ఈ అతినియమములేల? అని హేతువాదులు వాదింతురు. మానవజాతి చరిత్రను పరిశీలించినచో విచక్షణారహితమగు కామము సర్వనాశనమునకు దారితీసినటులే

కనపించును. రెండవ ప్రపంచయుద్ధము మొదలుకాగానే జర్మనీ, ఫ్రాన్సును సునాయాసముగా నోడించినది. ఫ్రెంచి సేనాపతి బాధతోనిటులన్నాడు. "మేము యుద్ధములో నోడిపోలేదు. నర్తనశాలలో ఓడిపోయినాము"- యువతీయువకులు విశృంఖల కామముతో నృత్యశాలావిహారులై వీరత్వమును వదలుటచే యుద్ధము సరిగాచేయువారే లేసి దురవస్థ ఫ్రెంచివారి కప్పుడు పట్టినది.

ఈ స్వేచ్ఛాకామము పాశ్చాత్య దేశములలో, అమెరికా, కెనడా మొ॥ ప్రదేశముల వెర్రితలలు వేయుచున్నట్లు తెలియుచున్నది. బహిరంగ రతిక్రీడా ప్రదర్శనలు. భార్యా వినిమయములు, వివాహబంధ నిర్మూలనము మానవజాతిని జంతుదశకు తీసికొని వెళ్ళునా యనిపించుచున్నది.

నీతి నియమరహిత కామము వినాశహేతువు. లోకములో నెంత కాముకులు కూడ స్వంతతల్లిని, సోదరిని, కూతురును శృంగారవిషయమున పరిహరింతురు. ఆ విధముగా పరిహరింపని వాడును లేకపోలేదు ఈజిప్టులో అబ్యాతేన్ అని ఒక చక్రవర్తి కలడు అతని కన్నకూతురు 'అతే' అను అతిలోక సౌందర్యరాశి తన అంతఃపురమున ఎందరు సౌందర్యవతులులేరు ! ఎందరువిలాసినులులేరు ! ప్రపంచమున మరి ఎందరుదొరకరు ఆ చాపలునకు స్వంత కుమార్తెపై మనసైనది. వాడురాజాయెను. ఎవరడ్డు చెప్పెదురు? అక్కడనేమి వేదశాస్త్రములు కలవా ధర్మమిదియని చెప్పుటకు? మహర్షులు కలరా శాసించుటకు? ఏదియులేదు. ఏదోగతానుగతికమగు ఆచారము.నేనా ఆచారము మార్చెదనన్నాడు రాజు. నాకన్నకూతురు ఆమెననుభవించుటకు నాకంటె ఎవరికి హక్కున్నదనినాడు. మారాజవంశీయులను పెండ్లిచేసికొన్నచో వారిశరీరగతరక్తము మా పవిత్ర రక్తముతో కలిసి సంకరసంతానము కలుగును. అది జరుగుటకు దైవాపచారము-కనుక మావంశ స్వచ్ఛతను. పవిత్రతను నిలుపుటకు మాలోమేమే పెండ్లాడ వలెను-అని ఒక నూతన సిద్ధాంతము చేసినాడాదుష్టుడు. క్రూరుడైన పరిపాలకునెవరేమందురు? అన్నచో వారిమెడల మీద దలలు నిలువవు. అన్నంతపని చేసినాడానీచుడు. తానుచేయుటకేకాదు దానినొకవంశాచారముగా మార్చినాడు. వారిలో వారేతండ్రి కూతురును, తండ్రిమరణించినచో ఆకూతురు సోదరుని, ఆ తల్లికొడుకును అక్కసెల్లెండ్రు అన్నదమ్ములను. వివాహమాడుట ఆ వంశమున చాలకాలము జరిగినది. అది టాలమీ రాజవంశము ఆ వంశములోని పుట్టినదే ప్రపంచసుందరి క్లియోపాత్రా. ఆమెబ్రతుకును అటులేకొనసాగినది. యధారాజా తధాప్రజా-

ఆదేశములోని ప్రజలకును అది అలవాటైనది. ఎప్పుడును స్వేచ్ఛగా గాడనట్లుగా ఉండును. అందును కామవిషయమున మరియు ఇది పాపము-తగదని చెప్పువారు వారిదృష్టిలో చేత గాని చవటలు, అనుభవించుటవల్ల గాని అసమర్థులు. భారతమున సర్పయాగకథ చూడుడు ఒక తక్షకుడు తప్పుచేసినాడు ఆ సర్పజాతి రాజహత్యా ఫలము ననుభవించినది.

ఉ॥ ప్రల్లదుడైన ఒక్కకుల పాంసను చేసినచేత తత్కులం
బెల్లను దూషితంబగుట యేమి అపూర్వము కావునన్ మహీ
వల్లభ! తక్షకాధమునెపంబున సర్పములెల్ల అగ్నిలో
ద్రెళ్ళగ సర్పయాగ మతిధీయుత! చేయుము విప్రసన్నిధిన్

అని ధర్మవిశేషమును ఉదంకుడు జనమేజయునకు వివరించినాడు. అటులే ఒక రాక్షస జాతియే నాశనమైనది. ద్రౌపది నవమానించినారు దుర్యోధన, దుశ్శాసనకర్ణులు. వారి మూలమున కౌరవ వంశమే సర్వనాశనమైనది. అక్రమకామమును తలపెట్టిన పంచ మహా పాపమెంతటి దుష్ఫలములనిచ్చునో అజ్ఞానులెరుగరు.

ఇంతకు వావివరుసలులేని దుష్కామఫలముగా అటాలమీరాజ వంశము నశించి పోయినది. ఆ యూనాన మునవలంబించిన జాతులేహపుమాసిపోయినవి. ఒకవ్యక్తి చేసిన పాపమునకు ఫలమొకవిధముగా నుండును. ఒకజాతి, ఒక మతముచేసిన పాపమునకు ఫలము మరింత తీవ్రముగానుండును. ఒక మతము వారీరోజు తాము బలవంతులై పర మతస్థులను హింసించి, వారి స్త్రీలను చెరచి, వారియిండ్లు తగులబెట్టి వారియాస్తులను దోచుకొందురు. కొన్నాళ్ళు వారు సుఖముగానున్నటులే ఉందురు. ఇంతలో ఒక పెద్ద వరదవచ్చును. తుఫానులు వీచును. ఉప్పెనలు వచ్చును. ఒకవంతు మరణింతురు. మఱి కొన్నాళ్ళకు ఒక ప్రబలుడు ప్రచండుడునగు రావణునివంటివాడు, మహిషాసురునివంటి వాడు వీరిపైకి దండెత్తును. వారి సైనికులు వీరిని నానాచిత్రహింసలు చేయుదురు. వీరి స్త్రీలను సామూహికముగాచెరతురు. అంతకుముందు వీరెన్ని దుష్కార్యములు చేసిరో అంతకు కొన్ని వందలరెట్లనుభవింతురు. అది సృష్టిరహస్యము. ఈనాడు ఒక పాప కార్యము చేసి దాన్ని చెడు తలంపులనుండి తన తెలివితేటలచే ప్రాపకముచే అధికారధన శక్తిచే తప్పించుకొంటినని విర్రవీగువానియంతటి వివేకహీనుడు మరియొకడులేడు. సంస్కారవంతుడటులనుకొనడు.

మరి అంతటి ఉత్తమ సంస్కారమెవిధముగావచ్చును? పెద్దల బోధలవల్లనన్నచో ఆ పెద్ద కెట్లు తెలియును? కేవలము గతాను గతికముగా పూర్వాపూర్వజీవితానుభవముల చేత సమాజావసరముల ననుసరించి నీతి నిర్మింపబడునా? సంస్కారము కలుగునా? అట్లుకాదు. అది యొకభాగము మాత్రమే. దానిని మించినదొకటి ఉన్నది ఇది నీతి-ధర్మము అని శాశ్వతప్రాతిపదికపై నిర్ణయింపగల అధికుల శక్తికేంద్రమొకటి ఈ దేశమున కలదు. అది దేశమునకు కాలమునకు అతీతమైనది. అదే వేదవాఙ్మయము. ఈశ్వరవాక్కు దానిని వినిన, కనినవారు ఋషులు ఆ శ్రుతి ననుసరించి స్మృతులు పుట్టినవి శాస్త్రములు పుట్టినవి అవి నిర్ణయములు చేసినవి. నీతివిధానములు పలికినవి, తరువాత పురాణములు అవి ధర్మప్రబోధములు కావించినవి వానిచే సుసంస్కృతవంతులైన భారతీయులు లక్షల సంవత్సరాలుగా ఒక అనూహ్యమైన జీవనవిధానముతో మానవ జాతికే సత్యశ్రేయస్సువిధాయకమైన ఒక భద్రంకర మహాపదమును నిర్దేశించిరి. ఆ మహాధర్మ పథమున ప్రయాణించిన ఉత్తమ ధర్మవ్యక్తుల జీవితమందించిన ఆదర్శమే భారతజాతి సంస్కృతిగా రూపొందినది.

సంస్కృతికి ప్రతీకలైన సత్యము, శీలము, అహింస మొదలగు అంశములను వ్యక్తిగతదృష్టితోనేగాక సమాజదృష్టితోను ఆలోచించవలసిన అవసరమున్నది. గాంధీ మహాత్ముడు మూడింటిని తన జీవితమున అనుసరించినవాడు. అహింసవిషయమున ఆయన అభిప్రాయములను పరిశీలించియున్నాము. సత్యశీలముల విషయమునగూడ ఆ మహానీయుడు దృఢమైన నిశ్చయములు కలవాడు. ఎట్టి పరిస్థితిలోను వానిని తప్పరాదని ఆయన నిర్ణయము. కాని జీవితములలో అందరికి అటులసాగదు. ఒకడు ఏ గూఢచారిదశములోనో చేరినాడనుకొనుడు. అతడు శత్రుదేశములకు వెళ్ళును. రహస్యములు సేకరించును. ఆ సమయమున అతడు తన ఊరు, పేరు, ఉద్యోగము అన్నిటిని గోప్యముగా ఉంచుకొనును అబద్ధమాడక తప్పని ఉద్యోగమతనిది. సత్యమే ఆడవలెనని నియమము పాటించినచో దేశమునకు ఏమియు సాధింపజాలడు. కనుక అతడేమిపలికినను అది దేశీయసత్యము. భారతమున ద్రోణుని విజృంభణమునరికట్టుటకై ధర్మరాజంతటి నిత్యసత్యవ్రతునకే అబద్ధమాడకతప్పలేదు. స్వకులరక్షణార్థమై అతడాడిన ఈపద్యమును, దోషయుక్తము కాదని వ్యాస, కృష్ణాదులు పలికినారు.

దేవీ భాగవతమున నొక కథ కలదు. ఒక తపస్వి సత్యముపలుకుటే వ్రతముగా పెట్టుకొని ఆశ్రమవాసియైయుండెడివాడు. ఒకనాడొక వనవరాహము కిరాతునిచేత తరుమ

బడి పరుగెత్తుకొనివచ్చి సత్యవ్రతుడు చూచుచుండగా ఒక పొదలోదాగుకొనెను. కాసేపటికి బోయవాడు వచ్చి తాపసికి నమస్కరించి "స్వామీ మీరు నిజమేచెప్పుదురని అందరము నెరుగుదుము-ఆహారార్థమై నేను వేటకు వచ్చితిని, అది మాకులవృత్తిగాన తప్పులేదుగదా! నేను తరుముచుండగా ఒక అడవిపంది తప్పించుకొని పరుగెత్తుచు ఇటేవచ్చినది, అదిఎటు పోయినదో, ఎక్కడనైన దాగినదో మీరు చెప్పవలెను. అని ప్రార్థించెను.

సత్యవ్రతునకేమియు తోచలేదు. సత్యముచెప్పిన ప్రాణభీతితో దాగిన జీవమునకు మరణము తప్పదు. అబద్ధమాడిన ఇన్నాళ్ళను తాను తాల్చిన వ్రతమునకు భంగమగును. అతడాలోచించి యిట్లు పలికెను. "కిరాతుడా! ఆజంతువును చూచినవి కనులు. అవి పలుక లేవు పలికేదినోరు అది చూడలేదు కనుక నేనేమి చెప్పగలను" బోయవాడీయన నేదో మనకర్థము తెలియని వేదాంతము చెప్పుచున్నాడుకాబోలునని వెళ్ళిపోయినాడు. ప్రాణిరక్షణకే ప్రాధాన్యమిచ్చినది. అది తరువాతకథ.

కనుక ఇతరప్రాణిరక్షణకు, దేశరక్షణకు అవసరమైన సత్యము వదలవచ్చును అటులని ఇంక ప్రతివిషయమునకు పనికిరాదు. సత్యము మహితపమని ప్రాచీనులు పలికినారు. సత్యముకొరకై భార్యను, బిడ్డను, రాజ్యమును త్యజించిన హరిశ్చంద్రుని కథ మనకాదర్శప్రాయము. సత్యమంటే ప్రాణిరక్షణ, అహింస గొప్పవని నిరూపించు టకు కాబోలు ఒక బౌద్ధకవి హరిశ్చంద్రుని సత్యప్రధానునిగా తీర్చి ఒక నాటకమును రచించెను. అందు హరిశ్చంద్రుడు ప్రాణిరక్షణకై, ఇతరులకు సాయముచేయుటకై అడుగడున అబద్ధములాడును. అవియొక చిత్రమైన నాటకము నాగానందనాటకమున జీమూతవాహ నుడు అటులె సత్యగోపనముచేసి తనశరీరమును గరుడునకర్పించుకొనెను. మరొకరిని కాపాడుటకు తమను అర్పించుకొను జీవకారుణ్యమునకే ఇచట ప్రాధాన్యము.

శీలవిషయమునగూడ మన సంస్కృతి అందించిన విశేషములను గమనింపవలసి యున్నది. భారతమున నలోపాఖ్యానము రమణీయకథ. అందు నలసతియైన దమ యంతి భర్త తనను అడవిలో విడిచిపెట్టిపోయిన తరువాత కానలఆకాంత కష్టములు పడుచు ఒకకొండచిలువనోట చిక్కుకున్నది. ప్రాణోపాయము. బోయడొకడు ఆదృశ్యము చూచి చిలువను చీల్చి ఆమెను కాపాడినాడు. ఆమెకు స్నానపానముల ఏర్పాటుచేసినాడు. సేద తీరిన దమయంతి అతిలోకసౌందర్యము వానిని వ్యామోహితుని జేసినది ఆమె నడిగినాడు. అమె ఒప్పుకొనలేదు బలవంతము చేసినాడు మొహమాట పెట్టినాడు. ఆమె వినలేదు. చివరకు బలాత్కరింపబోయినాడు ఆమె కోపించి తిట్టినది. అవి శాపాక్షరములై

వానిని నిలువున దహించినవి. కొందరాధునికులందరు "ఆ దమయంతికి కృతజ్ఞతలేదు. ప్రాణము కాపాడినాడు. లేకున్న చచ్చెడిదేగదా! 'శరీరమాద్యంఖలు ధర్మసాధనం'. ఒకసారి వానికిచేసినమేలుకు ప్రతిఫలముగా-తననిచ్చుకొన్ననేమి''? అని. ఈ శరీరమశాశ్వతమని, చావు పుట్టుకలు తప్పవని, ధర్మమే మానవునివెంట వచ్చునని ఎరిగినవాడెవ్వడునటులు పలుకడు. కృతజ్ఞతగా ఇయ్యవలసివచ్చిన అదితప్ప ఇంకేమైన నీయవచ్చును. ఉపకారి కోరదగిన ప్రతిఫలమదికాదు. దేనినైనను న్యాయమనునది యొకటి కలదు. ఆ పరిమితిని మించి కోరరాదు.

ఒకసారి కృష్ణరాయల ఆస్థానమున రాముని తమ్ములు గొప్పవారా? ధర్మరాజు తమ్ములు గొప్పవారా అను చర్చ జరిగినది. పలువురు పలురకములు చెప్పిరి. తమ్ముల సాయమున్నను రాముడు తనపనిని తాను సాధించుకొనగల సమర్థుడు. ధర్మరాజు అటుల కాదు. భీమార్జునులు లేకున్న ఆయన యేమిచేయగలడు? లక్ష్మణ భరత శత్రుఘ్నులు రామునియందు వినయవంతులై ఉన్నారన్న అదివారికి తప్పదు. రాముడన్నివిధముల వీర విక్రమ సాహసౌదార్యముల యందు తమ్ములకంటె గొప్పవాడు. తమ అన్నకంటే అన్నిటను అధికులైన భీమార్జునులు అన్నమాట జవదాటలేదన్న అది వారి సౌశీల్యమునకు గొప్పదనమునకు గుర్తు. కనుక ధర్మరాజు తమ్ములే గొప్పవారని రాయలు నిర్ణయించినాడు ఆయనకు ఛత్రముపట్టిన సేవకుడొకడు ప్రభువులను ఈ జన్మలోను పాండవులపైననే పక్షపాతము" అనినాడు. అనగా కృష్ణరాయలు పూర్వజన్మలో శ్రీకృష్ణుడని వాని భావము. ఈ ప్రస్తుతికి రాయలు హృదయము మెచ్చినది. నీకేమికావలెనో కోరుమిచ్చెదనని వానికి వరమిచ్చినాడు. ఏ చీనీ చీనాంబరములో, మణిమాణిక్యములో, మడిమాన్యములో సామాన్యముగా అర్థింతురు. వాడు తద్విరుద్ధముగా దేవరకోటకు నేను ప్రభువు కావలెనన్నాడు. అనగా విజయనగర సామ్రాజ్యాధిపతి కావలెనని వాని ఆశ. రాయలుకేమి పాలుపోలేదు. ఇచ్చినమాట తప్పవాడు కాడాయెను. అపరచాణక్యుడు తిమ్మరుసున్నాడు గదా చక్రమడ్డమువేయుటకు. వెంటనే దేవరకోటయను గ్రామము మన రాజ్యములో కలదు దానిని వానికిచ్చిన సరిపోవునన్నారు. వాడు రాయలువారి కోటనువీడి చిన్న గ్రామమునకు పోవలసివచ్చినది. దురాశ పనికిరాదు. మించిన కోరికకోరరాదు.

సత్యము విషయమునవలెనే శీలమువిషయమునను రెండు భాగములు కలవు. వ్యక్తిశీలము - సమష్టిశీలము. వైయక్తికమైనదొకటి. సమాజసంబంధమైనది వేరొకటి. దీనినొక చిన్ని ఉదాహరణతోవివరింతును. ఉత్తరమున కర్ణావతియను రాజ్యమొకటికలదు.

దాని ప్రభువు ధైర్యశౌర్యసాహసౌదార్యములు కలవాడే. కానీ స్త్రీవ్యసనమను బలహీనత ఒకటి ఉన్నది. అతడొకసారి తన మంత్రులలో నొకని కూతురు అద్భుతసౌందర్య సమన్వితయనివిని ఆమెను బలవంతముగా తెప్పించుకొని అనుభవించెను. దానితో మంత్రులకు, సేనాపతులకు, రాజ్యములోని పెద్దలకు కోపము, బాధ కలిగినవి. ఏమి చేయుటకును దుష్కార్యము చేసినవాడు రాజాయెను. రాజునెవరు శిక్షింతురు? ప్రధాన మంత్రితో అందరుకలసి ఆలోచించిరి. రాజును శిక్షించితీరవలెనని నిర్ణయించి ఎటుల శిక్షించుటో ప్రధానమంత్రిని ఆలోచింపమని కోరిరి. ఆయనకొకటే మార్గము తోచినది. అప్పుడు మహమ్మదీయులు వెల్లువవలె దండయాత్ర చేయుచున్నరోజులు. రహస్యముగా వారికి కబురుపెట్టినాడు. ఇంకేమున్నది మిడుతల దండువలెవచ్చిపడినారు. కోట ఆను పానులు తెలిసిన ప్రధాని వారికి దుర్గము సులభముగావశమగునట్లు చేసినాడు. వారు కోటనాక్రమించుకొని దుష్టుడగు ఆ రాజును సంహరించి మంత్రికోరిక దీర్చిరి. అంతటితో కథ పూర్తియైన విశేషమేమున్నది? కర్ణాపతినాక్రమించిన మహమ్మదీయులు వందల స్త్రీలను మానభంగము చేసిరి వేలమందిని సంహరించిరి. బలవంతముగా మతముమార్చిరి. గోవులను స్వేచ్ఛగా వధించిరి మంత్రిచేసిన పనివల్ల ముల్లుతీసి కొర్రుగుచ్చినటులైనది. ఒక స్త్రీకి అన్యాయము జరిగినదని దానికి తలపెట్టినప్రతీకారము వేలమందికి అపకారముగా ధర్మనాశనముగా పరిణమించినది. రాజును శిక్షించుట వ్యష్టిధర్మము. రాజ్యమును రక్షించుట సమిష్టిధర్మము. వ్యక్తిశీలముకంటె సమాజశీలము గొప్పది. భారతీయ సంస్కృతిలోని ఈ విశిష్టత్వమును అర్థముచేసికొనిన వారే నిజమగు రాజనీతికోవిదులై ప్రకాశించిరి. ఈ ధర్మసూక్ష్మములు తెలియనివారు సంస్కృతి మూలసూత్రములకు అపార్థములు కల్పించి అహంకారముచే ప్రమాదములపాలైరి. మహావీరుడగు పృథ్వీరాజు శరణాగత రక్షణము నొకవ్రతముగా పాలించినాడు. మహమ్మద్‌గోరీ ఎన్నిసార్లు దండయాత్రకు వచ్చినను తన శౌర్యధైర్యపరాక్రములచే వాని నోడించినాడు. ఓడినప్పుడెల్లవాడు కాళ్ల పట్టుకొని శరణువేడెడివాడు. శరణాగతరక్షణము రాజధర్మము గనుక పృథ్వీరాజు ప్రతి పర్యాయమును వానిని క్షమించి విడిచిపెట్టెడివాడు. చివరకొక్కసారి గోరీ గెలిచినాడు. పృథ్వీరాజును కళ్లుపెకిలించి చెరసాలలో హింసించి చంపించినాడు విదేశీయుడు, విధర్మీయుడు అయిన ఘోరీలోని దుష్టలక్షణములను గ్రహించక అన్నిసార్లు క్షమించుట పృథ్వీరాజులోని క్షత్రియాహంకారమును సూచించెనేకాని రాజనీతిని సూచింపదు. శరణాగత రక్షణమను ధర్మము అపాత్రన్యస్తమై జాతికి ప్రమాదమునుతెచ్చిన సంఘటన ఇది. మన సిద్ధాంతమును సరిగా అర్థము చేసికొనకపోవుటచే వచ్చిన నష్టమిది.

రాజపుత్రులలోను ఇటువంటి రాజనీతిరహితమైన పరిస్థితులెన్నో వచ్చినవి. మహమ్మదీయులతో వచ్చిన యుద్ధములలో ఓడిపోయెడి పరిస్థితులు వచ్చినపుడు తెగించి యుద్ధము చేసి, మరణించి వీరస్వర్గమునకు పోవుటకు సిద్ధపడిరేకాని, తాత్కాలికముగా వెనుకకు తగ్గి బలముకూర్చుకొని మరలగెలువవచ్చుగదా అను ఆలోచననే చేయరైరి. విజయప్రాప్తి కంటె వీరస్వర్గకాంక్షయే వారికి ప్రధానమై దేశచరిత్రలో ఎన్నోమార్పులను తెచ్చినది. మహారాష్ట్రీలావిధముగాకాక విజయమునే ధ్యేయముగా నుంచుకొనిరి. ఎన్నిసార్లు ఓడినను చివరి గెలుపెవనిదో వానినే లోకము గౌరవించును. ఒకజాతి తన సంస్కృతిని నిలబెట్టుకొని, తన ప్రజలను కాపాడుకోవలెనన్నచో అవసరమైనప్పుడు తలవంచక తప్పదు. అవకాశము వచ్చినపుడు విజృంభించి శత్రువును నాశనముచేసి గెలుపునందుకొనుటే లక్ష్యముగా నుంచుకొనవలెనుగాని తాత్కాలికమైన లొంగుబాటు అగౌరముగా భావింపరాదు. ఆ విధమైన రాజనీతి సమన్వితమైన మార్గమునెన్నుకొనిరి గనుకనే ప్రతి సందర్భమునను అంతిమ విజయము వారినే వరించినది,

శివాజీ జీవితములో పదపదమున నిటువంటి సంఘటనలే. ఎటులైనను శివాజీని నాశనము చేయవలెనను ఉద్దేశముతో ప్రతిజ్ఞచేసి బయలుదేరిన అఫ్జుల్‌ఖాన్ త్రోవపొడువునా దేవాలయములను పడగొట్టుచు, ఊళ్ళు తగుల బెట్టుచు, స్త్రీలను చెరచుచు, జనులను హింసించుచు బయలు దేరినాడు. ఇంతచేసిన శివాజీ వచ్చి తనతో యుద్ధయు చేయునని వాని ఆశ. మైదానములలో ఎదిరించి యుద్ధముచేసి అఫ్జుల్‌ఖాన్నును గెలుచుట అసంభవం. అందుకే కొండలలో కోనలలో సమయము కొరకు వేచియున్నాడు. తమను రక్షింపలేదని హిందువులే శివాజీని నిందించెడి స్థితి యేర్పడినది. దూషణ భూషణ తిరస్కారములన్నింటిని సమానముగా భరించెడిశక్తి కలవాడు శివాజీ. బయలు ప్రదేశముల ఖానుతో పోరాడిన వీరస్వర్గము వచ్చునేమో కాని విజయము మాత్రము లభింపదు. ఎందరేమన్నను కిమ్మనక మిన్నకున్నాడు. ప్రజల తత్వమతనికి బాగుగా తెలియును ఈ రోజు దూషించినవారే రేపు గెలిచినచో బ్రహ్మరథము పట్టుదురు. జనమెప్పుడును విజయవంతుని మెచ్చెదరు. వాడెటులు గెలిచినాడన్నది లోకమునకుపట్టదు. కనుకనే శివాజీ అపనిందలను, అవమానములను దిగమ్రింగి అఫ్జుల్‌ఖాన్‌వంటి దుష్టులనెందరినో పరిమార్చినాడు. కానీ రాజా జయసింగ్‌వంటి హిందూ వీరులతోనతనికి చిక్కేర్పడినది. మన సంస్కృతి తత్వము సరిగా అర్థము చేసికొనని వారిలో జయసింగ్ ఒకడు. క్షత్రియునకు రాజభక్తి అత్యంత ప్రధానమని ఆతని విశ్వాసము. మొగల్ చక్రవర్తికి తాను సామంతుడు కనుక అయనకు

సేవచేయుట తన ధర్మమని అతడు భావించెను, హిందూజాతి రక్షణకై శివాజీ చేయుచున్న మహా ప్రయత్నము కంటె తన రాజభక్తియే అతనికిగొప్ప. ఔరంగజేబు దుర్మార్గుడు అతడెరుగును. హిందువులను పీడించుచున్నాడని ఎరుగును. శివాజీ ధర్మవీరుడని కూడా అతని హృదయమునకెరుకయేకాని రాజభక్తి అతనిని కట్టిపైచినది. రాజభక్తికంటె దేశభక్తి విశిష్టమైనదను ధర్మసూక్ష్మము నాతడు గుర్తించలేక పోయినాడు. ఔరంగజేబు తన నాజ్ఞాపింపగనే శివాజీని గెలుచుటకై బయలుదేరిన రాజాజయసింగ్ సంగ్రామ విజయార్థమై బ్రహ్మాండమైన చండీయాగముచేసినాడు. ఆ చండీదేవత హిందూధర్మరక్షకుడైన శివాజీని ఓడించి తనను గెలిపించి తద్వారా ఔరంగజేబునకు విజయలక్ష్మిని ప్రసాదించవలెనని ఆయన ఆశయము. దేశభక్తికిని, రాజభక్తికిని సంఘటిల్లిన సంఘర్షణలు చరిత్ర పుటలలో మనకు చాలాచోట్ల కన్పట్టును.

మహమ్మదీయులు, ఆంగ్లేయులు ఈదేశమును పరిపాలించిన కాలములో వారికి విజయములు సాధించిపెట్టగలవారు హిందూవీరులే. ఆ ప్రభువుల దగ్గర ఉద్యోగములు చేయుచున్నారు కనుక వారి ఉప్పు తినుచున్నామను విశ్వాసముతో మనవారు వారికి సేవలుచేసిరి. కాని ఈ దేశసంపదను దోచి అందులోని కొంతభాగమును కుక్కకు బిస్కట్లు పడవేయునట్లు తమకు ఇంత పడవేసి తమను కొలిపించు కొనుచున్నారన్న సత్యము వారు గుర్తింపలేకపోయిరి. ఆ దాస్యము త్రికరణముల జీర్ణించి మన సంస్కృతి స్వరూపమును పూర్తిగా మరచిపోవు నంతటి అధోగతికి దిగజారిన వారిని ఎందరినో మనము గమనింపవచ్చును.

ఇటీవల కొలదికాలము క్రింద మన స్వతంత్ర భారతదేశపు పార్లమెంటులో సభలు జరుగుచున్న కాలమున ఒక సభ్యుడు మరొక సభ్యునకు ఈ క్రింది శ్లోకమును సంభాషణ వశమున వినిపించినాడు.

శ్లో॥ యావద్భ్రియేత జఠరం తావత్ స్వత్వం హిదేహినాం
అధికం యోభిమన్యేత సస్తేనో దండమర్హతి.

తన కడుపునకు పట్టినంత మాత్రమే మానవుడు ఆహారమును ఉంచుకొనవలెను. అంతకుమించి కావలెనని కోరువాడు కాని, నిలువయుంచుకొనువాడు కాని దొంగ, దండనార్హుడు. ఈభావముగల పై శ్లోకము వినినాడు ఒక కమ్యూనిస్టు పార్లమెంటు సభ్యుడు. వెంటనే మార్క్సు సిద్ధాంతములచేత ప్రభావితుడైన రచయిత ఎవ్వరో దీనిని రచియించి ఉండునని చెప్పెను. కానీ ఆ శ్లోకము ఎన్నోవందల సంవత్సరముల క్రింద మన సంస్కృతిలోనిది. ఆ మాట వినగానే ఆ లోక్‌సభా సభ్యునకు దిగ్భ్రాంతి కలిగినది. సమసమాజనిర్మాణమును గురించిన ఊహలు, ఆచరణలు, సిద్ధాంతములు అంతప్రాచీన

కాలముననే భారతదేశపు ధర్మానుశాసకులు భావించియుండుట అతని ఊహకందలేదు. మన సంస్కృతి సముద్రములో ఇట్టి చిరు అలలెన్నెన్నో.

మన సంప్రదాయములో అత్యంత ప్రధానమైనవానిలో దేవాలయములు - విగ్రహారాధన విమర్శకుపాత్రమైన అంశము. భగవంతుడున్నచో అంతటనుండడా? లేక దేవాలయములోనే ఉండునా? అక్కడి విగ్రహము వట్టిరాయియేగదా! రాతిలో దేవుడెట్లుండును ఇవన్నియు రకరకాల ప్రశ్నలు. భగవంతుడనువాడొకడున్నాడా? ఉన్నను అతడు నిరాకారుడు. ఈ రాతి బొమ్మలేమి - అర్ధరహితముగా? ఇవి మరికొన్ని సందేహములు.

అసలు దేవుడే లేడనునది అన్ని మతములలో అన్ని దేశములలో ఆస్తికులు నాస్తికులనుండి ఎదుర్కొనిన సవాలు. ఎప్పటికప్పుడు భగవదనుగ్రహప్రాప్తి నందిన వారు, దైవప్రేరితులు పరమేశ్వరుని ఉనికిని నిరూపించుచున్నను, సందేహగ్రస్తులు పుట్టుచునేయుందురు, ఇదియొక్క శాశ్వత సంగ్రామము. దైవాసుర శక్తుల మధ్యనుండు నిత్యయుద్ధము.

కొద్దికాలము క్రింద నాస్తికుడొకడు విగ్రహారాధనను, దేవాలయములను ఈ ధోరణిలోనే విమర్శించెను. నేనాతనితో ఒకక్రొత్త సమాధానము చెప్పితిని. దేవాలయములో బోధింపబడునది ప్రజాసేవ, సమసమాజనిర్మాణమని పలికితిని. అతడు నమ్మలేదు. నేను సోదాహరణముగా వివరించితిని.

దేవాలయమున పూజాంతమున మంత్రపుష్పము చెప్పుదురు

"సహస్రశీర్షం దేవం విశ్వాక్షం విశ్వశంభువం
విశ్వం నారాయణం దేవమక్షరం పరమంపదం
విశ్వతః పరమాన్నిత్యం విశ్వం నారాయణం హరిం
విశ్వమేవేదం పురుషః

ఈశ్వరుడు వేల తలలు, వేలకన్నులు కలవాడు. శాశ్వతుడు. ఈ విశ్వమే అతడు. దేవాలయములోని శిలావిగ్రహమును చూపి అర్చకుడు మనకుచేయు బోధ యిది. ఈరాయి దేవుడని కాదు అతడు చెప్పునది. పరమేశ్వరుడు అనంతప్రజారూపుడని చెప్పుచున్నాడు. అనగా ప్రజయే పరమేశ్వరుడని అర్థము. దేవాలయమునకు పోయిన ప్రతివాడును నేర్చుకోవలసిన పాఠమిది. ప్రజయే ఈశ్వరుడని తెలిసికొని ఆ ప్రజను సేవించుటే పరమేశ్వరారాధనగా గ్రహించి ప్రపంచమున ప్రవర్తింపవలెనని మంత్రపుష్పము మనకు అందించుచున్నది. ప్రజలందరునొకటే. ఎక్కువ తక్కువలు లేవు.

విద్యా వినయంసపన్నే బ్రాహ్మణే గవిహస్తిని
శునిచైవ శ్వపాకేచ పండితా స్సమదర్శినః "గీత"

సృష్టిలోని సర్వవస్తువులందును సమదర్శనులైన వారే నిజమైన పండితులు ఊరక శాస్త్రములువల్లించి, వాని తత్త్వము జీర్ణముకాక నన్ను ముట్టుకోకని దూరముగానుండువారు కారు.

ఆ నాస్తికునకేమియు తోచలేదు. నానుండి ఇటువంటి వాదము నాతడూహించి యుండలేదు. ఇది ఊహింపని కోణమునుండి కొట్టినదెబ్బగా అతడు భావించెను.

విగ్రహముగా మలచబడిన శిలయందేకాదు. చరాచర భూతజాలమునందు పరమేశ్వరుని దర్శించిన జాతిమనది. ప్రహ్లాదుడేమన్నాడో చూడుడు.

మ॥ కలడంభోధి కలండుగాలి గలడాకాశంబునం గుంభినిం
గల డగ్నిన్ దిశలన్ బగళ్ళ నిశలన్ ఖద్యోతచంద్రాత్మలం
గల డోంకారమునం త్రిమూర్తుల త్రిలింగవ్యక్తులందంతటన్
గల డీశుండు గలండు తండ్రి వెదుకంగా నేలయీయాయెడన్

కం॥ ఇందుగలడందు లేదని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
అందందే కలడు దానవాగ్రణి వింటే

భగవద్భక్తిమార్గములోను విభిన్న రీతులను అంగీకరించిన ప్రత్యేకత మనది. భగవంతుని ఏ ప్రభువుగానో మాత్రమే భావించవలసిన పనిలేదు. తండ్రిగా, తల్లిగా, సోదరునిగా, మిత్రునిగా, చివరకు ప్రియునిగా గూడ దేవుని అర్చించి అత్యంత సాన్నిహిత్యమును పొందవచ్చును. ఇవన్నియు నొకయెత్తు. వైరభక్తి యొకయెత్తు. భగవంతుని శత్రువుగా భావించికూడ తరింపవచ్చునని చెప్పినది మనమతమొక్కటే. భాగవతములో వైరానుబంధనమున విష్ణుని జేరినట్లు చిరతరభక్తితో కూడ జేరగరాదేమో-శత్రుత్వమే వేగముగా దేవుని జేర్చునేమోయనికూడ నారదుడు ధర్మరాజుతో చెప్పినాడు. ఏ భావమను దానికంటె ఎంత తీవ్రత యనునది ప్రధానమని భాగవతము మానవజాతికి తరుణోపాయమందించినది.

శా॥ కామోత్కంఠతగోపిక ల్భయమునన్ గంసుండు వైరక్రియా
సామగ్రిన్ శిశుపాలముఖ్య నృపతుల్ సంబంధులై వృష్ణులున్
ప్రేమన్ మీరలు భక్తినేము నిదె చక్రింగంటిమెట్లైనను
ద్వామధ్యానగరిష్ఠుడైన హరి జెందన్వచ్చు ధాత్రీశ్వరా!

భక్తి కేకాదు రక్తి కిని సముచితస్థానమునిచ్చినది మనపూర్వుల ఆలోచనాధోరణి, లోకమున అందరును విరాగులుకాలేరు. భక్తులుకాలేరు. అట్లుకాని వారిని రక్తులైననైనా సుఖింపుడని భర్తృహరియెట్లు బోధించినాడోచూడుడు.

చం॥ శిలమొన మూలముల్ చిదిమిచెన్నగు వేణు కరీరకాంతిచే
లలితములైన దర్భకబళంబులు లేళ్ళకునిమ్ము కానలో
కలితవయోంగనా మృదుల గండ సుపాండుర నాగవల్లి కా
దళములు గోళ్ళద్రుంచి వనితాతతికైన నొసంగు మిమ్ములన్

జీవితమున అటోయిటో పరమావధినందుకోవలెను గాని మధ్యేమార్గము శ్రేష్ఠులకుగాదని సుభాషితత్రిశతిమనకు సలహాయిచ్చుచున్నది.

భారతీయుల సంస్కృతి సంపద ప్రతిరంగమున నీవిధముగా ఉన్నత శిఖరముల నందుకొన్నది. ప్రపంచమునకు జ్ఞానజ్యోతిని ప్రసాదించిన మహత్తరజాతియిది. ఇరువది ఐదు, ముప్పదివేల సంవత్సరాలనాడే భారతీయులు తమ సంస్కృతి దీపికను అమెరికా ఖండమునకు మోసుకొనివచ్చిరని 1975 అమెరికన్‌రిపోర్టర్‌లో ఒక రెడ్‌ఇండియన్ ప్రొఫెసర్ సప్రమాణముగా నిరూపించినాడు.

అలెగ్జాండరుతోపాటు వచ్చిన అతని అధికారులలో నొక్కడగుపూటార్కు పంచనది ప్రాంతమున (పంజాబు) ఏయింటికిని తాళమువేయబడిలేదని వ్రాసినాడు. దొంగతన మనునది ఊహింపని కాలమీదేశమున నొకొప్పుడుండెనన్నచో ప్రజలెంత సంతృప్తులై ఉత్తమగుణములతో నలరారుచుండిరో ఊహింపవచ్చును. ఫాహియాన్, హ్యూయాన్‌సాంగ్ మొదలగుయాత్రికులీజాతి స్వర్ణాధ్యాయములోనున్న సమయమున సందర్శించి ఇక్కడి సంస్కృతిని అద్భుతముగా వర్ణించియున్నారు.

కాశ్మీరమునుండి కన్యాకుమారి వరకు తిరిగిన యాత్రికులెల్లరు ఈ దేశమువారు గాని, విదేశములవారుగాని ఈ జాతి సంస్కారహృదయమునెంతగానో గుర్తించి కీర్తించి యున్నారు. ఇచ్చటి ఆతిథ్యమర్యాద ప్రపంచమున నెచ్చటను లేదన్నచో అతియోక్తి కాదు అతిథిపూజనొక మహా వ్రతముగ స్వీకరించి పరిపాలించెడివారీ దేశమున అడుగడుగున కనుపట్టెడివారు. భాషలెన్నైన, వేషములెన్నైనా హిమవంతమునుండి సముద్రమువరకు నివసించెడి ప్రతివ్యక్తిలోని భారతీయాత్మ ఒకటే. అందులకే అక్కడి మానవుడు కాశీ వెళ్ళి గంగతెచ్చి రామేశ్వరునభిషేకించును. రామేశ్వరమునుండి కాశీవిశ్వానాధునికడకు జల ధరుడై ప్రయాణించును. గంగా, యమునా, గోదావరి, కృష్ణ, పినాకినీ, కావేరితో యప విత్రమైనదీసీమ. ఈ నీరులోని అన్నిరాష్ట్రములవారు నొకటే. అందరిభావన, అందరి ఆలోచన-సంస్కృతితత్వమున నొకటే.

# ఆంధ్ర సంస్కృతి

తెలుగువానిగా తెలుగుజాతికి సంబంధించిన కొన్ని సంస్కృతి విశేషములను ప్రత్యేకముగా పరిశీలింతును.

ఐతరేయ బ్రాహ్మణ కాలమునుండి విశ్వామిత్రుని కాలమునుండి ఆంధ్రుల ప్రస్తావనకనబడుచున్నను శాతవాహనుల కాలమువచ్చువరకు మనవారిగూర్చి యెక్కువ విశేషములు మనకు తెలియవు ప్రాచీనగ్రంథములోని ఆంధ్రులనాగరికులుగా కొన్నిచో కనుపట్టుచున్నది దానికేమి! ప్రతి జాతియు ప్రారంభదశలో అనాగరికముగా నుండుట పెద్ద విశేషము కాదు.

క్రీ శ. ప్రథమశతాబ్ది నాటికి శర్వవర్మ గుణాఢ్యుల వాదమును బరిశీలించిన అప్పటి ఆంధ్రులకొక నిర్దిష్టమగు స్వరూపమునొందిన ప్రత్యేకభాష కలదని యూహింపవచ్చును. ఆంధ్రభాషలో నాటికి సాహిత్య ముదయింపకపోయినను ఆనాటిప్రజల సంస్కారవిశేషములు హాలశాతవాహనుడు కూర్చిన గాథాసప్తశతి మూలమున తెలియుచున్నది. నాటి తెనుగువారి మృదుస్వభావము, ఆతిథ్యప్రియత్వము, లలితకళా రాసిక్యము ఆ సుందర ప్రాకృత కవితలలో మనకందుచున్నది.

మొదటి శాతకర్ణిరాణియైన దేవి నాగనిక ప్రతి మాసమునుపవసించి బ్రహ్మచర్య తపోవ్రతపరురాలగుటయే కాక దీర్ఘ యజ్ఞదీక్షలుకూడ నాచరించెడిదని నానేఘాట్ శాసనము వలన తెలియుచున్నది. వాసిష్టపుత్ర పులమావి నాసికశాసనము ననుసరించి మహాదేవి గౌతమిబాలశ్రీ సత్యదాన హింసానిరతురాలనియు, తమ నియమోపవాస తత్పరయనియు తెలియుచున్నది. రాజపుత్రులలోనే కాక సామాన్యులలో కూడ మహాదానధర్మవ్రతులైన వారు నాడు కలరని బోధిసిరి బౌద్ధగృహస్తురాలు నిరూపించినది. కాశ్మీర, గాంధార, చీనాది బహుదేశములలో సౌగత ధర్మములను ప్రచారముచేసిన బౌద్ధ సన్యాసుల ఉపయోగార్థమునా ఈమెయొక చైత్యగృహనిర్మాణము చేయించి అందుసమ సౌకర్యములుకల్పించి త్యాగ

నిరతిని మహారాజులను కూడ మించిపోయినది. ఈ శాసనములు ఈ గాథలు పరిశీలించినచో నాటి ఆంధ్రస్త్రీలు సంఘములో ఎంత స్వతంత్ర మహోన్నత స్థానము నలంకరించిరో, ఎన్నెన్ని ధార్మిక కార్యములుచేసి జాతి సంస్కృతిని పోషించిరో మన మూహించుటకు వీలగుచున్నది.

ఈ సందర్భమున ఆంధ్రుల ప్రవర్తనా విధానమును, మానసిక సంస్కారమును తీర్చిదిద్ది నియమబద్ధము చేయుటకు ప్రవర్తించిన ఆపస్తంబుని స్మరించుట సముచితము. సూత్రకారులలోకెల్ల అగ్రగణ్యుడై విద్వద్వరేణ్యుడైన ఆపస్తంబమహర్షి దేశభక్తి మిక్కిలి ప్రశంసనీయమైనది. కొన్ని శుభకర్మలలో దేశప్రభువును గూర్చియు, సమీప జీవనదీ మహత్వమునుగూర్చియు వైదికులచే గానము జరుగవలెనని అతడు నియమించుట నాటి ఆంధ్రుల దేశగౌరవభక్తి ప్రాధాన్యమును తెలుపుచున్నది. మహాభారతయుద్ధము తరువాత దురాచార దుష్పథములచే కల్లోలితమైన ఆంధ్రజాతి సంస్కృతి నుద్ధరించుటకు అతడెంతయో కృషిచేసి జనుల నైతికాభ్యున్నతికి రాచబాటలువేసి ధర్మాభినివేశమును కలిగించెను.

ఆ మునివర్యుని వలన ధర్మశాస్త్రమేకాక భౌతిక విజ్ఞానమును ఎంతయో పెంపొందినది. యాగవేదికలను వేయుటకును, భూమిని కొలుచుటకును అనువైన క్షేత్రరేఖాగణిత సంబంధములగు, శుల్బసూత్రములనీతడు రచించెను. ఈతని గ్రంథములలోని ఖగోళ శాస్త్రవిజ్ఞాన మాధునికులకు గూడ ప్రశంసార్హమైనది వైదికనిర్మాణ విధులలో ఈతడుశిల్పకళకు పునాదులు వేసినాడు. ఈతని శ్రౌతసూత్రములలో చైత్యనిర్మాణమునకు పద్ధతులు కలవు. చైత్యము మొదట వైదికచిహ్నమై తరువాత బౌద్ధులచే తమ శిల్పవిద్య యందంగీకరింపబడి ఎన్నియో సుందర చైత్య నిర్మాణములకు హేతువైనది ఈ విధముగా ఆపస్తంబుని శ్రౌత,గృహ్య, ధర్మసూత్రముల ప్రభావము ఆంధ్రజాతిపై ఎంతేని కలదు.

క్రీ.పూ. 4వ శతాబ్దమునాటికే ఇంత ప్రజ్ఞాప్రభావములు ప్రకటించిన ఆంధ్రజాతి పరాక్రమము నందును సామాన్యమైనదికాదు. ఆంధ్రులకసంఖ్యాకములైన గ్రామములును ప్రాకార సమావృతములై కోటకొమ్మలు గల ముప్పది నగరములును కవలనియు, వారి రాజునకు లక్ష గాల్బములును, రెండువేల ఆశ్విక దళములును, వేయి యేనుగులను కల వనియు గ్రీకు రాయబారి మెగస్తనీసు వర్ణించినాడు. శ్రీశైల, కాళేశ్వర, దక్షారామ శివలింగములచే త్రిలింగ సంజ్ఞనొందిన యీ తెలుగుదేశము సాంస్కృతికముగా అత్యంత

ప్రాచీన కాలము నుండియే మహోన్నతి నొందియుండుట అంత ఆశ్చర్యకరమైన విషయ మేమియుకాదు.

శాతవాహనుల కాలమున స్మరింప వలసిన ఒక మహా సాంస్కృతిక నిర్మాత నాగార్జునాచార్యుడు. యజ్ఞ శ్రీ శాతకర్ణికి సమకాలికుడుగా భావింపబడుచున్న ఈ మహా పురుషుడు సర్వవిద్యల యందును నిష్ణాతుడు. వేదాంత, తర్క రసాయన, వృక్ష, వైద్యాది సర్వశాస్త్రముల యందును పారంగతుడు. మనుష్యుల మానసిక రోగములను బాపుటకై అశోకుడు బౌద్ధ ధర్మముసూత్రములను శిలా స్తంభములపై చెక్కించినట్లు, ఆచార్య నాగార్జునుడు మానవుల దేహరోగములను బాపుకొనుట కవసరమగు వైద్యశాస్త్ర సూత్రములను స్తంభములమీద చెక్కించి ప్రకటించెనట. ఈయన యాధర్వమున నాగార్జునకొండ సంఘారామము గొప్ప పరిశోధనాగారముగా పరిణమించెనని చెప్పుదురు. క్షుద్ర లోహములను సువర్ణముగా మార్చు విద్య నీతడు కనిపెట్టెనని చెప్పుదురు.

ప్రధానముగా నీతనికి కీర్తితెచ్చినది శూన్యవాద సిద్ధాంతము. కారణరహితమైన అస్తిత్వమగు సూన్యత్వమునందే ప్రకృతి పరిణామములు సమస్తమును సమత్వము నొందునని అతడు బోధించెను. దీనికే మాధ్యమిక వాదమనియు పేరు. ఈతడు మహా భక్తుడు, సిద్ధుడు ఈతని నాటి నుండియే బౌద్ధులలో విగ్రహారాధనము బుద్ధ ప్రతిమలను పూజుంచుట సర్వసామాన్యమైనది ఈ పరిణామము శిల్ప చిత్ర కళాదృష్టితో మిక్కిలి ప్రయోజనకారియై అజంతా, ఎల్లోరా మున్నగు మహా సౌందర్య కేంద్రములకు దారితీసినది. నాటి ఆంధ్రబౌద్ధుల భక్తి భావమునకు కళా నైపుణ్యమునకు కొండలు కూడ మైనపు ముండలై మెత్తబడిన లోకోత్తర శిల్పకళా నిలయములైనవి

శాతవాహనుల తర్వాత పల్లవులు, కాదంబులు, శాలంకాయనులు ఆంధ్రులకీర్తి ధ్వజమును ఉన్నతోన్నతముగా నిలిపి చరిత్రలో పేర్కొనదగిన స్థానము సంపాదించిరి ఇక చాళుక్యుల కాలంలో ఆంధ్రజాతిలో సాంస్కృతికమైన మహా సంఘటన మొకటి జరిగినది. అదియే భారతావతరణము. ఆంధ్రుల భావనా తపస్సు శబ్దబ్రహ్మ స్వరూప మున సాక్షాత్కరించిన స్మరణీయ సమయమది. నాటి ప్రజాజీవితమెట్లు మనుమార్గ నిష్టమై ప్రవర్తిల్లు చుండెడిదో చూడుడు.

సీ. నిజమహీమండల ప్రజఁ బ్రీతిఁ బెంచుచు
పరమండలంబుల ధరణి పతుల
నదిమి కప్పంబుల ముదముతో గొనుచును
బలిమినీయని భూమివలయపతుల
నుక్కడగించుచు దిక్కుల తనయాజ్ఞ
వెలిగించుచును విప్రకులము నెల్ల
బ్రోచుచు శరణన్న గాచుచు భీతుల
నగ్రజన్మలకు ననుగ్రహమున
చారుతర మహాగ్రహారంబు లిచ్చుచు
దేవభోగముల మహా విభూతి
తనర జేయు చిట్లు మనుమార్గుడగు విష్ణు
వర్ధనుండు వంశ వర్ధనుండు

భారత-ఆది-1-7

అపార శబ్దశాస్త్ర పారగులైన వైయాకరణులు, భారత రామాయణాద్యనేక పురాణ ప్రవీణులైన పౌరాణికులు, మృదుమధుర రసభావ భాసుర నవార్థవచన రచనా విశారదులైన మహాకవులు, వివిధతర్క విగాహిత సమస్త శాస్త్ర సాగర సారతరీయః ప్రతిభులైన తార్కికులును వైణిక గాయకులును నాదిగా గలుగు విద్వజ్జనంబులు (భారత-ఆది-2-8).

నాటి విద్యాగోష్టులలో పాల్గొనుచుండెడివారని తెలియుచున్నది.

చం॥ పరమవివేక సౌరభ విభాసిత సద్గుణపుంజ వారిజో
ర్కర రుచిరంబులై సకలగమ్యసుతీర్థములై మహా మనో
హర సుచరిత్ర పావనపయః పరిపూర్ణములైన సత్సభాం
తర సరసీవనంబులు ... ... ...

(భారత, ఆది 1-24)

అలరారుచుండెడివి.

ఆ సభాసదులలో మేటియై రాజరాజ నరేంద్రుని కులబ్రాహ్మడై, అవిరళ జప హోమ తత్పరుడై: విపులశబ్దశాసనుడై, బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాననిరతుడై, ఉభయభాషాకావ్య రచనాభిశోభితుడై, సత్ప్రతిభాభియోగ్యుడై నిత్యరచనుడైన నన్నయ భట్టారకుడు తన ప్రభుప్రేరణచే భారతమును తెలుగున రచించినాడు.

ఆంధ్ర భాషలోనేకాదు. భారతదేశమందలి సర్వభాషలలోను రామాయణ భారత భాగవతములు రచింపబడిన తరువాతనే ఏ కావ్యములు వచ్చినను; ఏ గాథలు రచింపబడినను, ఎక్కడి కక్కడ ఇదే జరిగినదన్నచో అందులో ఏదో పరమార్థముండి తీరవలెను. వివిధ భాషలలో, వివిధ కాలములలో, వివిధ కవులు ఒకచోట కూడబలుకుకొని ఇది చేసిరన జాలము గదా! కావున భారతభూమిలోని, ప్రతి దేశభాషాసారస్వతములలోను ఇట్టులే జరిగినదన్నచో ఒకానొక సాంస్కృతిక మహాప్రేరణము దానికి కారణభూతమై యుండ వలెను. అ వైదికములు, అ భారతీయులైన అధార్మిక విజృంభణముల నరికట్టుటకును ఆ రామాయణ, భారత భాగవత గాథలలోని మానవ మనస్తత్వములను జాతి కందించుటకును నాటి కవులా విధముగా రచియించి యుందురు.

ఏ జాతికైనను, ఏదేశ ప్రజాసముదాయమునకైనను సుఖశాంతులతో వర్ధిల్లజేయగల సువ్యవస్థ అవసరము. ఆమూడు గ్రంథములా మహా వ్యవస్థాసముపస్థితికి సార్వకాలికముగా తోడ్పడునవి. రామాయణము, అల్పమానుష (వానరులు) అమానుష(రాక్షసులు) అతి మానుష (దివ్యులు), మానుష పాత్రల వర్తనసంకలనము ఆదర్శధర్మ సంస్థాపమున దాని స్థానము సమున్నతము

భారతము రామాయణమువలె కాక పరమ పరిణితులైన మానవుల క్లిష్ట మనస్తత్వ సంఘర్షణమును రూపు కట్టించినది. రామాయణములో ఎవరిది ధర్మమో, ఎవరిది అధర్మమో ఆలోచింపవలసిన పనిలేదు. అది సుస్పష్టము. భారతముననో రాజ్యాధి కార విషయమునుండి ప్రతిచిన్న అంశమును ధర్మాధర్మ నిర్ణయ మహాక్లిష్టభావ సంఘ టితము భీష్మునివంటి ధర్మవేత్తయే ద్యూతసమయమున ధర్మము నిర్ణయింపలేక ధర్మజు నడుగుమని, ద్రౌపదికి సూచించినాడు. ఈవిధముగ భారతమొక మహత్తర ధర్మప్రతిష్ఠా పనాత్మకమైన నీతినిధి, ఇక భాగవతము మానవత్వములో నుండి దైవత్వమునకు ప్రయాణముచేయించగల భక్తి మార్గసముల్లేఖనము. అందుకే అంత భారతము పలికిన వ్యాసుడుకూడ సంతృప్తి చెందలేక జీవితము చరితార్థము చేయగల భాగవతము భక్తిరస పునీతముగా నిర్మించి అతిమానుష సీమలకు నిచ్చెనలు వేసినాడు.

తెలుగుదేశములో ఆ మూడింటిలో భారతము ముందుదయించుట యాదృచ్ఛికము కాదు. జైన దార్వాకాది అవైదిక మతముల విజృంభణములతో కల్లోలితమైన ఆంధ్ర దేశమున ధర్మగ్లాని తొలగించి ధర్మాభ్యుత్థానము కలిగించుటకు భారతము తప్ప మరొక గ్రంథావతరణమున కవకాశములేదు. జాతి నైతికాభ్యుదయము సంభావించిన మహా

ప్రతిభాసంపన్నుడగు నన్నయ భట్టారకుడు భారతీయ సంస్కృతి స్రవంతిలోనుండి ఆంధ్రదేశమునకు పిల్లకాలువలు తీసినాడు. భారత బద్ధస్పృహులై ఆంధ్రులు బహు యాగఫల పరమార్థమును సాధింపవలెనని ఆ శబ్దశాసనుడు భారతాంధ్రీకరణ రూపమున జాతికి పరమోపకారము కావించినాడు.

తరువాత నన్నెచోడుని కుమారసంభవములో నాటి సంస్కృతి విశేషము లనేకము తెలియుచున్నవి. వివాహ నిశ్చితార్థ సమయమున కన్యకకు ముద్రారోహణము చేయుట, వివాహానంతరము రంగులతో వసంతమాడుట.

> "తనరారు క్రోళ్ళను (క్రోవి=చిమ్ముడు గొట్టము) నొత్తు
> కుంకుమారుణాకీర్ణ జలధార లమరె"
>
> కుమార 7-139

మొదలగు నాచారములేకాక నాటి యుద్ధతంత్ర విధానములుకూడ ఆతని గ్రంథమున కానవచ్చుచున్నవి. సేనాధిపతి ప్రస్థాన భేరి వేయించగనే సైన్యము యుద్ధసన్నద్ధమయ్యెడిది. ఎలగోలు సైన్యము (advance army) ముందు నడచెడిది. దుందుభులు, వీరమద్దెలలు, ఢక్కలు, బాకాలు శంఖాలు మ్రోయించెడివారు. ఏనుగులదళము, గుఱ్ఱపు దళము దానితో సైనిక వ్యయమునకు కావలసిన ధనభాండారము నడచెడిది. రాజులు. మంత్రులు, ఇతర ముఖ్యులు, వారి యంతఃపుర స్త్రీలు యుద్ధరంగమునకు వెడలెడివారు. స్త్రీల రక్షణకు కొంతసేన ప్రత్యేకింపబడెడిది. ధనుర్బాణములు, ఖడ్గములు, కుంతములు, గదలు మొదలగు ఆయుధములతో రణము జరిగెడిది. సైనికులలో కొందరు యుద్ధము నుండి తిరిగి వత్తుమో రామో యని సర్వస్వదానులు. వీరసన్న్యాసులు నయ్యెడివారు.

నాటి రాజులు, సంపన్నులు మహా భోగము లనుభవించెడివారు. వారి స్నానగృహములు మెరిసెడి స్తంభములతో, స్ఫటిక వేదికలతో, కాచకుట్టిమములతో, చిత్రములతో అలంకృతమై యుండెడివి. సుగంధద్రవ్య పరిమళిత జలస్నానములు, ముక్తాభస్మ,కర్పూర సహిత తాంబూలములు, నానావర్ణోజ్వల వస్త్రములు, రుచిరాన్న విశేషములు బహు ధానుభూతము లయ్యెడివి.

పిదప కాకతీయుల కాలములో తెనుగుజాతి ఉచ్చదశ ననుభవించినది. ఆంధ్రుల ఉత్తమోత్తమ శిల్పము లీకాలముననే బయలుదేరినవి. హనుమకొండలోని వేయి స్తంభాల దేవాలయ శిథిలము లిప్పటికిని నాటిశిల్ప వైభవము తెలుపుచున్నవి. రామప్పగుడిలోని సుందరాంగుల భంగిమలు జాయపసేనాని రచించిన నాట్యశాస్త్రోదాహరణము లందురు.

తెనుగువారిలో అలంకరణ ప్రీతి విపరీతముగా పెరిగిన రోజులవి. ప్రతాపరుద్రుని ఉంపుడుకత్తెయగు మాచల్దేవి యిల్లు ఎటులలంకరింపబడినదో చూడుడు.

చందనంబున కలయంపి చల్లినారు
ముగ్గులిడినారు కాశ్మీరమున ముదమున
వాసి నారిందుజరమున రంగవల్లి
కంజముల తోరణంబుల గట్టినారు- (క్రీడాభి)

వెన్నెలలో జాజరపాటలు పాడుచు ఆనందించెడి వారని నాచన సోమనాథుడు వసంతవిలాస కావ్యములో నిట్లు రచించినాడు.

వీణాగానము-వెన్నెల తేట
రాణ మీరగా రమణులపాట
ప్రాణమైన పిన్నబ్రాహ్మణవీట
జాణలు మెత్తురు జాజరపాట.

కాకతీయుల రాజధానియగు ఓరగల్లు నాడాంధ్ర సంస్కృతికి నాగరకతకు కేంద్రముగా నుండెడిది. అది సర్వభోగ నిలయమని శ్రీనాథుడు క్రీడాభిరామములో పలికినాడు. నాటి పూటకూటి యిండ్లు నేటి అధునాతనమగు హోటళ్ళకేవిధమునను తీసిపోయినట్లులేవు.

సంధి విగ్రహ యానాది సంఘటనల
బంధకీ జారులకు రాయబారి యగుచు
పట్టణంబున నిత్యంబు పవలు రేలు
పూటకూటింట వర్తించు పుష్పశరుడు.

తెనుగు దేశమున మతకలహములు పెచ్చుమీరిన కాలమది. జైన, శైవ, వైష్ణవ మతములు ప్రాబల్యమునకై పరస్పరము తీవ్రముగా కలహించుకొన్నవి. మూడింటిలోను కులనిర్మూలన మొక సామాన్య సిద్ధాంతము. మత ప్రచారమునకై సామాన్యజనుల కందు కందుబాటులో నున్న పాలీ భాషలో బౌద్ధులు బోధించినట్లు, వీరశైవులు జాను తెనుగులో ద్విపదాది ఛందములలో తమ సిద్ధాంతములు, భక్తులగాథలు ప్రచారము చేసిరి.

పాల్కురికి సోమనాథునివంటి మహాపండితుడు కూడ వీరశైవ మత ప్రచారకుడై

భువిజన దర్శన స్పర్శనాలాప
వివిధ దానాదాన విషయ దూరగుండ

అని ఉద్రేకముతో చెప్పుకొన్నాడు. వర దైవతములను సహింపని యా వీర శైవ, వీర వైష్ణవముల మూలమున రాజకీయ, సాంఘిక భద్రత కూడ కొంత కొంత తప్పినదనవచ్చును. అటువంటి క్లిష్ట కష్టకాలములో ఆంధ్రజాతికి మార్గ దర్శకుడై నిలిచి సాంస్కృతిక సౌధము పతనము కాకుండ నిలిపినవాడు తిక్కనా మాత్యుడు. ఆ మహాకవి భారత గ్రంథ పూరణముతో తెనుగు సారస్వత గగన మున వెన్నెల వెలుగులు వెలసినవి. సర్వమత ధర్మ దేవతా సమన్వయాత్మకమైన ధర్మాద్వైతము నా మహాపురుషుడు భారత జ్యోతిగా సాక్షాత్కరించుకొని యిట్లు న్నాడు.

విద్వత్ సంస్తవనీయ భవ్యకవితావేశుండు విజ్ఞాన సం
పద్విఖ్యాతుడు సంయమి ప్రకర సంభావ్యాను భావుండు కృ
ష్ణద్వైపాయనుఁ డర్థి లోకహితనిష్ఠంబూని కావించె ధ
ర్మాద్వైత స్థితి భారతాఖ్యమగు లేఖ్యంబైన యామ్నాయమున్.

హరిహరు లొక్కటే యనియు, ఆ పరతత్త్వము

"శ్రీయన గౌరినాబరగు చెల్వకు చిత్తము పల్లవింప భ
ద్రాయితమూర్తియై హరిహరంబగు రూపము దాల్చి విష్ణు రూ
పాయ నమశ్శివాయ యని పల్కెడు భక్తజనంబు వైదిక
ధ్యాయిత కిచ్చ మెచ్చు"

ననియు సిద్ధాంతీకరించినాడు. మానవులందరి గమ్యస్థానమగు ఆనందబ్రహ్మను భూతి నందుటకై ఎట్లు భావింపవలెనో తాను ఆదర్శముగా ఆచరించిచూపి తన జీవితము నాంధ్రుల శ్రేయస్సు కంకితము కావించినాడు.

ఉ॥ కావున భారతామృతము కర్ణపుటంబుల నారగ్రోలి యాం
ధ్రావలి మోదమున్ బొరయునట్లుగ సాత్యవతేయ సంస్మృతి
శ్రీ విభవాస్పదంబయిన చిత్తము తోడ మహాకవిత్వ దీ
క్షావిధినొంది పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్.

ఈవిధముగా తిక్కన మహాకవి భారత దర్శనముతో పరమత దూషణా లకుమైన ఆంధ్రావనికి సుఖ శాంతులు లభించినవి.

మొత్తము మీద కాకతీయుల కాలములో మతముల పేర సమాజములో చాల మార్పులు కలిగినవి. సంఘ సంస్కారమునకై అనేక ప్రయత్నములు జరిగినవి. జైన, శైవ పండితులు కులనిర్మూలనకై మిక్కిలి పాటుపడిరి. అనులోమ ప్రతిలోమ వివాహములును పెద్దవారిలోనే జరిగినవి. రుద్రమాంబయొక్క బ్రాహ్మణ మంత్రియగు ఇందులూరి అన్నయ రుద్రమదేవి రెండవకూతురగు రుయ్యమ్మను పెండ్లాడెను. ఇంచుమించు ఇదే కాలమునాటిదగు పలనాటి యుద్ధగాథలో బ్రహ్మనాయుడు బహుకుల బాంధవ్యము నెరపుటయు లోక విదితము. అన్ని కులముల వారును ఒకే పంక్తిలో చాపకూడు కుడుచుటయు జరిగినది. బ్రహ్మనాయనికి క్షత్రియాంగన యందు పుట్టిన బాలచంద్రుని వలెనే, హరిజనాంగన యందుదయించిన కన్నమపీడును సముచిత గౌరవస్థానము నొంది యుండుట గమనింపదగిన యంశము.

కాకతీయ సామ్రాజ్య పతనానంతరము, విజయనగర రెడ్డి, వెలమ రాజులు తెనుగుదేశమున సామ్రాజ్యములు స్థాపించిరి. ముగ్గురురాజులు తమలో తాము కలహించుకొనుచున్నను, కళాపోషణకు సంస్కృతి ప్రదీప్తికి నిరంతరము కృషి చేసిరి. ప్రజలు కూడ చాల భాగము సుఖభోగ వైభవములతో వర్ధిల్లిరనుట నిస్సందేహము. వేమారెడ్డిపాలనలో ప్రజలెట్లు సుఖపడిరో ప్రబంధ పరమేశ్వరుడగు ఎఱ్ఱాప్రగ్గడ యిట్లు పలికినాడు.

సీ॥ అగ్రహారములు విద్యాతపోవృద్ధ వి
    ప్రులకిచ్చి యజ్ఞకర్తలుగ నునిచె
కొమరార చెరువులు గుళ్ళు ప్రతిష్ఠించి
    లోక సంభావ్యంబులుగ నొనర్చె
నిధులు నల్లిండ్లును నిలిపె తోటలు సత్ర
    ములు చలివెందరల్ వెలయబెట్టె
హేమాద్రి పరికీర్తితామిత వరదాన
    నివహంబులన్నియు నిర్వహించె
చెసె చేయుచునున్నాడు సేయనున్న
వాడు పునరుక్తి కృతి శుభావలుల నెల్ల
ననగ శ్రీవేమవిభున కయ్యారు పేర్మి
వశమె వర్ణింప తద్భాగ్య వైభవంబు

నాటి రెడ్డిరాజులు తమ జీవితము నెట్లు ప్రజల కంకితముచేసిరో వెన్నె కంటి సూరన యిట్లు వర్ణించినాడు.

కం॥ తనబ్రతుకు భూమిసురులకు
తన బిరుదులు పంట వంశ ధరణీశులకున్
తన నయము భూమి ప్రజలకు
అనవేమన యిచ్చె కీర్తి నభవుండగుచున్.

రెడ్డి ప్రభువుల పరాక్రమము నాటి తెలుగుదేశమునకు పెట్టని కోటగా నుంచెను. శ్రీనాథుని యీ క్రింది పద్యము వారి మహత్వమున కొక చిన్న ఉదహరణము.

సీ॥ తన కృపాణము సముద్ధతవైరి శుద్ధాంత
తాటంకముల కెగ్గుదలచు చుండ
తన బాహుపీఠంబు ధరణిభృత్కమఠాహి
సామజంబులకు విశ్రాంతి యొసగ
తన కీర్తినర్తకి ఘనతర బ్రహ్మాండ
భవనభూముల గొండ్లిఁబరిడవిల్ల
తన దానమహిమ సంతాన చింతారత్న
జీమూత సురభుల నిగ్గుపరుపఁ
తే॥ బరగు శ్రీ వేమమండలేశ్వరుని........

శృంగార నైషధము 1-9.

తెలుగు దేశమునకు భోగ ద్రవ్యములు తెచ్చుటకు సముద్రముల మీద నౌకాయానము, ద్వీపాంతర వాణిజ్యము జరుగు చుండెడిదని శ్రీనాథుడు తన హరవిలాసములో తెలిపినాడు.

సీ॥ పంజార కర్పూర పాదపంబులు తెచ్చె
జలనోంగి బంగారుమొలక తెచ్చె
సింహళంబున గంధ సింధురంబులు తెచ్చె
హురుమంజి బలుతేజిహురులు తెచ్చె

గోవసంశుద్ధ సంకుమద ద్రవము తెచ్చె
యాంపకట్టాణి ముత్యాలు తెచ్చె
ఘోటకస్తూరికా పుటకోశములు తెచ్చె
చీని చీనాంబర శ్రేణి తెచ్చె
జగద గోపాల రాయవేశ్యాభుజంగ
పల్లవాదిత్య భూదాన పరశురామ
కొమరగిరి రాజదేవేంద్రుదు కూర్మిహితుడు
జాణ జెగటిట్టి దేవయచామిసెట్టి.

హరవిలాసము-కృత్యాది.

కప్పలి, జోంగు, పల్లివలికా సమ్మన్లు (నౌకావిశేషములు) ఉపయోగించి కస్తూరీ కుంకుమాది సుగంధ ద్రవ్యములను నాటి ఆంధ్రవర్తకులు తెచ్చుచుండిరన్నచో నాటి ఆంధ్రజాతి మహోన్నతిని కొంత భావింపవచ్చును.

ఏ దేశమున సారస్వత మహోన్నత స్థానమునందునో, ఎక్కడ కవులు పూజింప బడుదురో అది సాంస్కృతికముగా ఉన్నతి నొందుటకు చిహ్నమని ప్రపంచ పండితులందరును అంగీకరించియున్నారు. మహాకవియగు శ్రీనాథుడానాడు పొందిన గౌరవము తెలుగు సరస్వతి పొందిన గౌరవము; తెనుగుజాతి పొందిన గౌరవము. ప్రౌఢ దేవరాయల సభలో డిండిమభట్టారకుని కంచుఢక్క పగిలించిన శ్రీనాథుని పాండిత్య ప్రాభవము కనకస్నాన మాడినది. రాచకొండ వెడలుచు ఆ మహాకవి యేమని పలికినాడో చూడుడు.

సీ॥ దీనారటంకాల తీర్థమాడించితి
దక్షిణాధీశు ముత్యాలశాల
పగులగొట్టించి తుద్భటవివాద ప్రౌఢి
గౌడడిండిమభట్టు కంచుఢక్క
పలుకు తోడై తాంధ్ర భాషా మహాకావ్య
నైషధగ్రంథ సందర్భమందు
ఎట్లు మెప్పించెదో నన్ను నింక మీద
రావు సింగ మహీపాలు దీవిశాలు
నిండు కొలువున నెలకొనియుండి నీవు
సరసద్గుణ నికురంబ! శారదాంబ!

సింగభూపాలుని ఆస్థానము ఎంత పండిత నిలయమో పైదానిచే ఊహింప వచ్చును. లౌకిక వేష భాషలకు అతీతముగా సింగభూపాలు నాస్థానమున విద్వజ్జన మర్యాద జరుగుచుండెడిదని,

కిం దారుణా వంకరటింకరేణ
కిం వాససా ఓకిరి బాకిరేణ
శ్రీ సింగభూపాలుని విలోకనార్థం
వైదోష్యమేకం విదుషాం సహాయాః

అను శ్లోకమున పెద్దిభట్టు పలికినాడు.

జాతిలో రాసిక్యము నిండారి పండు వెన్నెలలు కురిసిన కాలమది. దైవ చింతనతోపాటు భోగాసక్తియు వెచ్చు పెరిగినది. నాటి గోదావరీ ప్రాంత విప్రులను శ్రీనాధుఁడెట్లు వర్ణించెనో చూడుడు.

ధరియింపనేర్చిరి దర్భవెట్టెడు వ్రేళ్ళ
 లీల మాణిక్యాంగుళీయకములు
కల్పింప నేర్చిరి గంగమట్టియ మీద
 కస్తూరికా పుండ్రకములు నొసల
సవరింప నేర్చిరి జన్నిదంబుల ప్రోల
 తారహారములు ముత్యాల సరులు
చేర్పంగ నేర్చిరి శిఖలనెన్నడుముల
 కమ్మని క్రొత్త చెల్వంగ విరులు

ధామముల వెండియును బైడి తడబడంగ
బ్రాహ్మణోత్తము లగ్రహారముల లోన
వేమ భూపాలు డనుజన్మ వీరభద్రు
ధాత్రి యేలింప గౌతమీ తటము నందు

కాశీఖండము : భీమేశ్వర పురాణము 1-41

ప్రౌఢ దేవరాయ, సర్వజ్ఞసింగ భూపాల, వేమారెడ్డి ప్రభృతి రాజన్యుల పాలనలో నాటి సంస్కృతి సముజ్జ్వలమై అలరారినట్లు శ్రీనాధుని సాహిత్యము నుండి విస్పష్టముగా తెలియుచున్నది.

ఒక్క కవిత్వమేకాక సంగీత నాట్యాది కళలును నాడు పరాకాష్ఠ నందు కొన్నవి. సౌందర్యాధి దేవతయైన లకుమాదేవి నాట్యము నాడు జగత్ప్రసిద్ధ మైనది.

జయతి మహీమాలోకాతీత కుమారగిరి ప్రభో
సదసి లకుమాదేవీ యస్య ప్రియా సదృశీ ప్రియా
నవమభినయం నాట్యార్థానాం తనోతి సహస్రథా
వితరతి బహూనర్థాన్ అర్థిప్రజాయ సహస్రశః

అను శ్లోకములో నామె ప్రశస్తి వర్ణింపబడినది.

'కల్ల చెప్పము విను నీకుగల ప్రసిద్ధి
ఢిల్లీ సురతాణికిని లేదు పల్లవోష్ఠి'

అని పేరొందిన మాచల్దేవి వలెనే లకుమాదేవియు ఆంధ్రదేశ ముదయింప జేసిన సౌందర్యరాశిగా స్మృతిపథమున మిగులును.

తెనుగుదేశ ప్రజల ఆహార విహారములను శ్రీనాథుడు వర్ణించినట్లు మరెవ్వరును వర్ణింపలేదు. నాటి ప్రజల ఆహార ప్రియత్వము నెట్లు కవి పలికి నాడో చూడుడు.

శా॥ ద్రాక్షాపానక ఖండశర్కరలతో రంభాఫల శ్రేణితో
గోక్షీరంబులతోడ మండెగలతో క్రొన్నేతితో పప్పుతో
నక్షయ్యంబగు నేరుప్రాల కలమాహారంబు నిశ్శంకత
కుక్షుల్ నిండగ నారగించితిమి యక్షుద్ర క్షుధా శాంతికిన్.

నాటి తెలుగు సంస్కృతిలో మరువరాని మరొక విశేషము కలదు. తెలుగువారి సాహస త్యాగములను ప్రకటించు నంశమిది. మొదటినుండియు ఆంధ్రులు సాహసులు, తెగింపు కలవారు. దేశము కొరకైననేమి, రాజు కొరకైననేమి, దేవుని కొరకైననేమి ప్రాణములను తృణప్రాయముగా త్యజింప గల గుణము మనవారిలో కలదు. యుద్ధములో వెనుదీయక పోరి మరణించుట సహజము. భక్తి పారవశ్యముచే నెట్టి సాహస కృత్యములు నాటి తెలుగువారు చేసెడివారో చూడుడు.

సీ॥ రవరవమండు నెఱ్ఱని చంద్రమల్లెల
　　చోద్యంపు గుండాలు చొచ్చువారు
కరవాడి యడుగుల గనపపాతర్లలో
　　నుట్టిచేరుల గోసి యురుకువారు
గాలంపుగొంకి కంకాళ చర్మము గ్రుచ్చి
　　యుడువీధి నుయ్యేలలూగువారు
కటికిహోన్నాళంబు గండక త్తెర వట్టి
　　మినిమింతులునుగాక మ్రింగువారు
సందులును నారసంబులు సలుపువారు
యెడమ కుడిచేత నారతులిచ్చువారు
సాహసము మూర్తి గైకొన్న సరణివారు
ధీర హృదయులు మైలారు వీరభటులు

—క్రీడాభిరామము

విజయనగర ప్రభువుల కాలములో అందులోను ముఖ్యముగా కృష్ణ దేవ రాయల కాలములో నాంధ్రజాతి మహోత్కృష్ట దశ ననుభవించినదని చెప్ప వచ్చును. అది ఆంధ్రులకు స్వర్ణయుగ కాలమనుట నిస్సందేహము. రాజ వీథు లలో రత్నాలు రాసులుపోసి అమ్మిన వైభవోపేత కాలమది.

కం॥ "ప్రతి వర్ష వసంతోత్సవ
కుతు కాగత సుకవి నికర గుంఫితకావ్య
స్మృతి రోమాంచ విశంకిత
చతురాంతః పురవధూ ప్రసాధన రసికు"

డైన ఆ మహారాజు ఆంధ్రకవితా పితామహునకు కాలికి గండపెండేరము తొడిగి, పల్లకి తన కేల బట్టియెత్తి మహాగౌరవము చేసినాడు. ప్రపంచ చరిత్రలోనే యే కవికిని అంత గౌరవము జరిగినట్లు వినము. అసామాన్య పరాక్రమ సంపన్ను డైన ఒక మహాచక్రవర్తి కవుల కంతటి పూజచేయుట ఆంధ్రజాతి చేసికొన్న మహా సుకృతము.

"ఎదురైనచో తన మదకరీంద్రము డిగ్గి
కేలూత యొసగి యెక్కించుకొనియె
మనుచరిత్రంబందు కొనువేళ పురమేగ
పల్లకి తన కేలబట్టి యెత్తె
కోకట గ్రామాద్యనే కాగ్రహారంబు
లడిగిన సీమలయందు నిచ్చె
బిరుదైన కవి గండపెండేరమున కీవె
తగుదంచు తానె పాదమున దొడిగె
ఆంధ్ర కవితా పితామహ! అల్లసాని
పెద్దన కవీంద్ర! యని నన్ను బిలుచునట్టి"

అని పెద్దన వర్ణించిన కృష్ణరాయల సాహిత్యపోషణము నిరుపమానము. తనకు పూజ్యుడైన పెద్దనకు మాత్రమే కాదు; తాను వైష్ణవుడై, శైవుడగు ధూర్జటికిని సమముగ నమస్కారము చేసినాడన్నచో

"కృష్ణరాయ కిరీట కీలిత మణిగణా
శ్రిత పదాబ్జద్వయ శ్రీ వహించు"

ఆ మహారాజు పరమత సహనము, కవితాప్రీతి మన యూహల కందనిది.

లోకములో తమ ప్రాంతములోని నదులను, దేవతలను ప్రేమించి పూజించుట సహజము. కాని తెనాలి రామకృష్ణుని యంత అభిమానము చూపిన వారరుదు. తుంగభద్రానదిని వర్ణించుచు గంగా యమునల కంటె అధికమగు స్థానము దాని కెంత చమత్కారముగా కల్పించినాడో చూడుడు.

శా॥ గంగా సంగమ మిచ్చగించునె మదిన్ గావేరి దేవేరిగా
నంగీకార మొనర్చునే యమునతో నానందమున్ బొందునే
రంగత్తుంగ తరంగ హస్తములతో రత్నాకరేంద్రుండు నీ
యంగం బంటి సుఖించునేని గుణభద్రా! తుంగభద్రానదీ!

పాండురంగ మాహాత్మ్యము

ఆయన తననాటి ప్రజల జీవిత విధానమును బాగుగా పరిశీలించినట్లు ఆముక్తమాల్యద నుండి తెలియుచున్నది. నీళ్ళు తెచ్చుకొను స్త్రీలు కూడా ద్రావిడ ప్రబంధములు చదువుచు దైవభక్తి నెట్లు భావించు కొందురో పరమ రమణీయ ముగా నిట్లు పలికినాడు.

మ॥ శయపూజాంబుజముల్ కటిం దడబడన్ జన్నోయి లేఁగౌనుపైఁ
దయ దప్పన్ పసపాడి పాగడపు పాదంబొప్ప చెంగల్వఁ డి
గ్గియ నీ రచ్యుత మజ్జనార్థము ఘటిం గీలించి దివ్య ప్రబం
ధ యుగాస్యల్ ద్రవిడాంగనల్ నడుతురు ధ్యానంబులో త్రోవలన్.

వర్షావేళ పల్లెటూళ్ళలో

మ॥ గురుగుం జెంచలి తుమ్మి లేదగిరిసాకున్ దింత్రిణీపల్లవో
త్కరముం గూడ పొరంటినూనియలతో కట్టారి యో
గరముల్ మెక్కి తమింబసుల్ పొలమువో త్రేవుల్ మెయిన్ నాక మే
కెరువుం గంపటి మంచమెక్కిరి ప్రభుత్వైచా ప్తి రెడ్లజడిన్

—ఆముక్తమాల్యద.

అంతేకాదు

శా॥ తారుణ్యాతిగ చూత నూత్న ఫలయుక్ తైలాభిఘార స్వన
ద్ధారా ధూషిత శుష్యదంబుహృత మాత్స్యచ్ఛద పాకోద్గతో
ద్గారంపుంగస రార్చు భోగులకు సంధ్యావేళలన్ కేళికాం
తారాభ్యంతర వాలుకా స్థిత హిమాంకర్నారికేళాంబువున్

అను పద్యము చేపల వగరు పోవుటకై ఇసుకలో దాచిన కొబ్బరి నీరు త్రాగుదురని వర్ణించుటచే నాటి ప్రజల అభిరుచులు తెలియుచున్నవి. ఇక రాజనీతి, వేదాంతము పరమ పరిణతముగా ఆ రాజకవి వర్ణించి నాటి తెలుగు దేశ వైభవ మున కందించినాడు.

నాటి కాలములోని కావ్యములలో రాసిక్యము పెచ్చుపెరుగుటవలన వచ్చు ఫలితములు బహువిధముగా నిరూపింపబడినవి. శ్రీనాథుని గుణనిధికథ, తెనాలి

రామకృష్ణుని నిగమశర్మోపాఖ్యానము, కందుకూరి రుద్రకవి నిరంకుశోపాఖ్యానము నిట్టివి. యువకులలో విపరీతగతి నొందిన కామపురుషార్థము వలన గలుగు దుష్ఫలితము లిందు వర్ణింపబడినవి. వరుసగా ననేక కవుల గ్రంథములలో నిట్టి పాత్రలు కల్పింపబడిన వన్నచో నాటి జాతిలో నధికమగుచున్న ఆ దుర్గుణము నరికట్టుటకై కవులెంత పాటుపడిరో ఊహింపవచ్చును.

విజయనగర రాజుల కాలము తరువాత తెలుగు సీమ చాల కాలము పరాక్రాంతమైనది.

యవనుల దండయాత్రలకుముందు భారతదేశమున యుద్ధములు జరిగినను సామాన్యులకు బాధిలుండెడివి కావు. వారి నిత్యకార్య నిర్వహణమునకెట్టి యిబ్బందులు కలిగెడివి కావు. కాని తరువాత మన రాజుల సైన్యములలోను అట్టి దుష్కృత్యములు బయలుదేరినవి. కాకున్న పోతనవంటి సత్యశీలుడు

ఉ॥ కాటుకకంటి నీరు చనుకట్టు పయిం బడ నేల యేడ్చెదో
కైటభదైత్యమర్దనుని గాదిలి కోడల యోమదంబ! యో
హాటకగర్భురాణి! నిను నాఁకటికిన్ గొనిపోయి యల్లకర్ణాట
కిరాట కీచకుల కమ్మ త్రిశుద్ధిగ నమ్ము భారతీ!

యునియు, నిమ్మరాజేశ్వరాధములనియు, తనకాలము వారిని గూర్చి పలుకడు.

పర పరిపాలనలో గ్రుక్కిన తెనుగు సంస్కృతి దక్షిణాంధ్ర దేశమున కొంతకాలము ప్రకాశించినది. అదియు నొక విశేషమే. రఘునాథ నాయక, విజయరాఘవ నాయక రాజుల కాలమున ఆంధ్ర సాహిత్య వైభవము కొంత పునర్విజృంభించినది. చేమకూర వేంకటకవి విజయ విలాసమీకాలము నందలి చెప్పదగిన కావ్యము. కృష్ణాధ్వరి, కాళకవి మొదలగు కవుల రచనలలో నాటి దక్షిణాంధ్ర రాజుల వైభవము తెలియుచున్నది. రంగాజమ్మ, ముద్దుపళని మొదలగు కవయిత్రుల రచనలును గమనింపదగినవి.

దక్షిణాంధ్ర యుగమునకు పేరు ప్రతిష్ఠలు తెచ్చినవారు మహా మహులగు త్యాగయ్య, క్షేత్రయ్య, తమ సంగీత, సాహిత్య మహాప్రభావముచే ఆంధ్రులకే గాక యావద్దక్షిణాపథమునకు వెలుగుదెచ్చిన వీరి వైశిష్ట్యము స్మరించి తీరవలసినది.

యక్షగాన వాఙ్మయము నాటి కాలమునకు చెందిన ఒక ఉత్తమ సారస్వత ప్రక్రియ. సంగీత నాట్యకళా సంభావుకమగు నీ ప్రక్రియ సాహిత్యమునకొక అలంకారమని చెప్పవచ్చును. త్యాగరాజు వంటి వాగ్గేయకారుడు కూడ ప్రహ్లాద భక్తి విజయము, నౌకా చరితము అను యక్షగానములు రచించెనన్నచో నాటి తెనుగు ప్రజలకు కలిగిన అభిరుచి విశేషము గమనింపవచ్చును. సిద్ధేంద్రయోగి వర్ధిల్ల జేసిన కూచిపూడి భాగవత విధానముకూడ నిట స్మరింపదగినది. ఆంధ్రుల సంస్కృతి కిది యొక ప్రత్యేక చిహ్నము.

దేశము సుఖశాంతులతో నున్నప్పుడు, కళాపోషకులగు పాలకులున్నప్పుడు మాత్రమే యేజాతిలోనైనను సాంస్కృతిక ప్రదీప్తి కలుగును. తరువాతి కాలములో దేశము తురుష్కులకు, ఆంగ్లేయులకు వశము కాగా ఆంధ్రులలోని విశిష్ట గుణములు తాత్కాలికముగా మరుగుగుపడినవి. అనైకమత్యముచేత శౌర్య సాహసములు కుంటుపడినవి. గోగులపాటి కూర్మనాథుడను కవి ఆంధ్రసంస్కృతి నాశనమగు చుండగా చూడలేక విశాఖపట్టణ మండలములో తురకలు ప్రవేశించి బీభత్సము చేయుచుండగా సింహాద్రి నరసింహస్వామిని సంబోధించి యొక శతకము పలికినాడు.

గ్రామముల్ నిర్ధూమధామమ్ము లయ్యెను
సస్యంబు లెల్ల నాశనముచెందె
దొడ్లలో శాకముల్ దుంపశుద్ధిగబోయె
దోచిరి సర్వంబు గోచిదక్క.........

యజ్ఞములు, గుడులు నాశనమై స్త్రీ పురుషులు నానా హింసల పాలుకాగా నాతడిట్లెత్తిపొడిచినాడు.

"కాక రోషంబు కలిగిన కఠిన యవన
సేన నిర్జించి యీ యాంధ్ర సృష్టి నిలుపు
వైరిహరరంహ! సింహాద్రినారసింహ"

అనగా నపుడు గుడిలోనుండి తుమ్మెదల దండు బయలుదేరి యవనుల పారద్రోలెనట!

మొత్తముమీద కొంత కాలముపాటు నివురు గప్పిన నిప్పువలె భారత దేశములోని ఇతర ప్రాంతములవలెనే ఆంధ్ర ప్రాంతమును పరపరిపాలనలో సుప్తమైనది. అప్పటికిని చిన్న చిన్న సంస్థానములలో యథాశక్తి కళాపోషణ మును, సంస్కృతి పరిరక్షణ ప్రయత్నములును జరగకపోలేదు. ఏదైనను మరల ఆంధ్రజాతి ఒక మహాశక్తిగా నిలిచినది, మొన్నటి స్వాతంత్ర్యోద్యమ సమయమున. తెలుగు కవులు మరొక్కసారి ఉవ్వెత్తుగ మహోదధి తరంగాలవలె లేచి ఆంధ్ర సాంస్కృతిక వైభవము కీర్తించి స్వాతంత్ర్యోద్యమ మహా జ్వాలలలో సమిధలు వేసినారు.

ఆంగ్ల పాలన విముక్తికై జరిగిన ప్రయత్నములలో ఆంధ్రులు సృష్టించిన సాహిత్యము సామాన్యమైనది కాదు. సంస్కృతి మహితమైన జాతిలో తాత్కాలిక ముగా నొక నిద్రాణస్థితి దాపురించినను త్వరలోనే జాతిని జాగృతము చేయగల శక్తిమంతమగు సాహిత్యము పుట్టును. తెనుగు సీమలో నటులే దేశభక్తి ప్రేరక మైన ఉత్తమ కవిత్వము విజృంభించినది.

"దేశమంటే మట్టి కాదోయ్
దే. మంటే మనుజులోయ్!"
"దేశమును ప్రేమించుమన్నా!
మంచియన్నది పెంచుమన్నా!"

అని గురజాడ అప్పారావుగారు పలుకగా

"ఏ దేశమేగినా ఎందు కాలిడిన
ఏ పీఠమెక్కిన ఎవ్వరేమనిన
పొగడరా నీ తల్లి భూమిభారతిని" అని

రాయప్రోలు సుబ్బారావుగారు ప్రబోధించినారు. కందుకూరి వీరేశలింగం పంతులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం మొదలగు రచయితలు సంఘ సంస్కర ణాత్మకమైన సాహిత్యమును ఎంతో అందించినారు. దేవులపల్లి, శ్రీశ్రీ, దాశరథి, నారాయణరెడ్డి ప్రభృతులు సలిపిన కవితా గానమును ప్రబోధాత్మకమైనది. ఈ విధముగా నెందరో ఆంధ్ర సంస్కృతికి సముద్దీప్తి కలిగించుటకై దేశ కాలముల ననుసరించి కృషి చేసినారు.

అధునాతన కాలమున అభారతీయములు, విభారతీయములునైన కొన్ని ఉద్యమములు ఆంధ్ర సంస్కృతిపై కొంత ప్రభావము చూపుచున్నవి. ఐనను అది తాత్కాలికము మాత్రమే. వైదేశిక నాగరికత మహా ప్రవాహమై మన సంస్కృతిని ముంచివేయునా అని భయము అప్పుడప్పుడు కలుగుచున్నను, మేరునగధీరులై భారతీయ ధర్మ ప్రతిష్ఠాపనమునకై విశ్వనాథవంటి మహాకవులు

................ఔపనిషదు
లాత్త గండూషితత్రయు లేర్వవహ్ని
గర్భితాంత స్తపస్కులు ఘనులు ఋషుల
కెవ్వడు విరోధి తద్వధ కెత్తిన యది.

అని తమ లేఖినులు సాధించి పుంఖాను పుంఖముగా రచనలందించు చున్నంతవరకు జాతికి జాగృతి సముద్దీప్త మగుటలో సందేహము లేదు.

"చుట్టూరా ఆవరించుకుని వున్న
చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడం
కంటె, ప్రయత్నించి ఎంత చిన్న
దీపాన్నయినా వెలిగించడం మంచిది"



Blank Page

తెలుగు ఎదలో తెలుగుతనం
వెల్లువలా పారాలని
తెలుగింటిలో తెలుగుదీపం
అఖండంగా వెలగాలని
ఈ జాతి నిద్రలేచి
మహోన్నత మానవాదర్శాల వైపు
నిరంతర కృషితో
పయనం కొనసాగించాలనే ధ్యేయంతో
ఉడుతాభక్తిగా యువభారతి కృషి చేస్తున్నది
భాషాభిమానం కలగాలంటే
మాతృభాషా సాహిత్య పఠనమే
ప్రథమ కర్తవ్యం అనే భావం
బలంగా మనసులో నాటుకోవడానికి గాను
వీలైనంత ఎక్కువ మందికి వీలైనంత తక్కువ వెలకు
ఉత్తమసాహిత్యం అందించేందుకు
యువభారతి పూనుకున్నది
ప్రతి తెలుగింటిలో
కనీసం పదయినా తెలుగు పుస్తకాలు ఉండేందుకు
మనందరం ఉద్యమ వేగంతో కృషిచేద్దాం
ఆ పదిమంచి పుస్తకాలలో ఏ ఒక్కటిగానైనా
యువభారతి ప్రచురణ ఏ ఒక్కటైనా
ఉండాలనే ధ్యేయంతో కృషిచేద్దాం

# యువభారతి

సాహితీ, సాంస్కృతిక సంస్థ
5, కింగ్స్‌వే, సికిందరాబాదు - 3